


"హల్లో ప్రియా! ఇక్కడా దాక్కున్నావు?" అంటూ భారతి రూంలోకి ఉప్పెనలాగా వచ్చిపడింది నీలవేణి.

"అలా పిలవొద్దని ఎన్నిసార్లు చెప్పాలి నీకు? ఏం మునిగిందనీ అంత హడావిడిగా వచ్చిపడ్డావు?" తన ఉలికిపాటుని కప్పిపెడుతూ తాపీగా అంది భారతి.

ఓ పదినిముషాల క్రితందాకా రకరకాల డ్యూటీలు ముగించుకుని అప్పుడే వచ్చి కూర్చుంది భారతి. ఇంకో అరగంట పోతే ఎలాగా పిల్లలని వాకింగుకి తీసుకు బయిలుదేరుతుంది. వాళ్ళు వేసే ప్రశ్నలకి సమాధానాలు చెప్తూ, వాళ్ళు చేసే అల్లరి పనులని భరిస్తూ కొంచెం దూరం నడిచి తిరిగి వచ్చేసరికి, ఉందనుకున్న ప్రాణం కాస్తా పోయిందనిపిస్తుంది. అది తెలుసు కనుకనే ఓ పది నిముషాలు రెస్టు తీసుకుందామని కాళ్లు కుర్చీలో పడేసి, తలక్రింద తలగడా పడేసుకుని కళ్ళు మూసుకుంది భారతి.

"ఏం లేదోయ్, మన ప్రేతం లేదూ,


నిన్ను ఆఘమేఘాలమీద పిల్చుకు రమ్మంది," అంది నీలవేణి.

"తప్పు అలా అనకూడదు. ప్రిన్సిపాల్ అన్నాక డ్యూటీలు ఉంటాయి. అవి నిర్వర్తించవలసిన విధి ఆవిడది. నీలాంటి గడుగ్గాయిలని కంట్రోలు చేయాలంటే కమ్చీలు కావాలిగా? అవునుగాని నీలా, అవిడ ఎందుకు పిలిచినట్టూ?" అడిగింది - అనుమానంగానే భారతి.

కుర్రవాళ్ళకే కాదు, టీచర్లకి కూడా ప్రిన్సిపాల్ అంటే కొంచెం దడే. నిజంగా అల్లరిచేసిన అమ్మాయికి, ఆ సంగతి ప్రిన్సిపాల్కి తెలిసిందని తెలిస్తే సింహస్వప్నమే! కన్ను మూతపడదు. 'సాయింత్రం దాకా టిఫిన్ డ్యూటీ, గార్డెన్ డ్యూటీ చూసి కదా పైకి వస్తి? ఇంతట్లో ఏం జరిగి ఉంటుంది!' అనుకుంటూనే రేగిన జుట్టు సవరించుకొని, చీర సర్దుకుని నిలబడింది భారతి. ఓసారి అద్దంలో ముఖం చూసుకుని తలుపు జేరవేసి నీలవేణి వెంట క్రింది అంతస్తుకి, ప్రిన్సిపాల్ గదికి నడిచింది భారతి.

ఐదు సంవత్సరాల క్రింతం ఈ బోర్డింగు స్కూల్లో టీచరుగానూ, వార్డెనుగానూ ఉండడానికని వచ్చి చేరింది భారతి. నాజూకుగా సన్నంగా ఉండే భారతి ఏంచెయ కలదని అమ్మాయిలకి అనిపించినా, తప్పు చేస్తే నిప్పు లాంటిదని గ్రహించారు. అందుకే భారతి అంటే హాస్టలు అమ్మాయిలకి గౌరవమే కాకుండా అపరిమితం అయిన అభిమానంకూడా ఏర్పడింది.

ఇదివరలో రోజుకో అయిదు సార్లేనా వార్డెను పెద్దావిడ దగ్గరకి నేరాలు మోసుకునచ్చేది. భారతి వచ్చాక ప్రిన్సిపాల్కి ఆ బెడద తప్పింది. భారతి తెలివిగా అమ్మాయిలతోనే ఒక న్యాయస్థానం ఏర్పరచింది. ఎవరేనా రూల్సు అతిక్రమిస్తే ఆ కోర్టుముందు పెట్టడమే తనవంతు అనీ, తరువాత న్యాయ నిర్ణయం ఆ కోర్టుదేననీ బాధ్యతని అమ్మాయిల మీదే పెట్టడంతో ఒక విధమైన చైతన్యము వచ్చింది హాస్టల్లోకి. పిల్లల అల్లరులూ, కొంటెపనులూ చాలా తగ్గిపోయాయి. ఒకరకం సరదా, ఐకమత్యంగా కలిసి కాలక్షేపం చేయడం లాంటివి పెరిగాయి. భారతి ఇంకో సూత్రంకూడా కనిపెట్టింది. ఏమీ తోచకపోతేకదా అల్లరికి టైము? చేతికి కావలసినంత పని, మెదడుకి కావలసినంత మేత ఉంటే ఏ గొడవా లేదని కనిపెట్టింది. వాళ్ళలో వాళ్ళకి కుట్లూ అల్లికలూ చేతిపనులూ చేయడంలో, అలంకరణలలో సరదాకి పోటీలు పెట్టి, చిన్నచిన్న నాటకాలూ నాట్యాలూ వాళ్ళంతట వాళ్ళే తయ్యారుచేసి ప్రదర్శించేలా చేసి, పిల్ల




"చూడండి, మీ మంచికే చెప్పుతున్నాను. ఏమీ భయపడక యీ విల్లుమీద సంతకం పెట్టండి."

లలో ఉత్సాహం నింపింది. అంచేత తీరిక సమయంలో చదవడానికేం లేక పోతే అమ్మాయిలకి చేతిలో తగినంత పని ఏర్పడింది. అసలీ స్కూలు ఉద్దేశం అలాంటిదని భారతి చేరిన కొత్తలో అమ్మగారు చెప్పారు.

"వీళ్ళంతా గొప్పింటి పిల్లలు. చదువుసంధ్యలు ముగించడమే ముఖ్యంకాదు వీళ్ళకి. గౌరవ కుటుంబాలలోని కన్నెలు ఇంకో కుటుంబంలోకి కోడళ్ళుగా వెళ్ళినప్పుడు గర్వంగా హుందాగా బ్రతకకల్గాలి. అది నేర్పడముకూడా ముఖ్యమే. పాఠాలు కంఠతా పట్టించి, పరీక్షలు ప్యాసు చేయించడంకాదు. జీవితంలో హుందాగా మసలడం, అందంగా నలుగురికీ గౌరవం కల్గేటట్టు మనడం, జీవితాన్ని అందంగా మలచుకోడం లాంటి వాటికి నాందిగా ఈ స్కూలు వుండాలని లేటు జమీందారిణి కోరిక. కీర్తిశేషులైన జమీందారిణిగారు ఆ కోర్కె నెరవేరాలనే తన ఆస్థి సర్వస్వాన్నీ ఈ స్కూలుకి వ్రాశారు. వివరంగా చెప్పి అప్పగించారు ప్రిన్సిపాల్. ఆ వివరణ ఈనాటికీ భారతి చెవుల్లో వినబడుతూనే ఉంది.

"నిజమే - ఇటువంటి స్కూలునుంచి వెళ్ళిన పిల్లలు జీవితంలో దేన్నీ చూసి భయపడిపోరు - నాలాగా" అనుకునేది కొత్తలో.

భారతికి చిన్నప్పుడే తల్లిలేదు. చదువు ముగించి ఇంకేం చెయ్యాలి ? అని ఆలోచిస్తున్న సమయంలో తండ్రి గతించాడు. తండ్రి అంత్యక్రియల కోసం వచ్చిన దూరపు బంధువులంతా కలిసి ఈ స్కూల్లో టీచరుగా చేరమని ప్రోత్సహించారు. విషాదం అలుము కొన్న ఆ వున్నవూళ్లో ఉండేకంటే నల్గురి ముఖాలూ చూస్తూ ఇటువంటి బోర్డింగు స్కూల్లో ఉంటేనే హాయిగా, మనసుకు విశ్రాంతిగా ఉంటుందేమో నని వచ్చి చేరింది భారతి. చేరిననాటి నుండీ ఆ దివ్యభవంతిలో తనూ ఒక భాగం అయిపోయి, అందరికీ తలలో నాలుకగా తయారైంది.

"ఈ పాతిక మెట్లూ పదిహేను రోజులు దిగేలా ఉన్నారు రాణీగారు! ఏమిటి కథ ?" అంటూ ముందుకి నెట్టింది నీలవేణి.

నీలవేణి స్కూలు ఆఫీసులో గుమాస్తాగా ఉంటూంది. భారతికీ నీలవేణికీ బాగా స్నేహం కలిసింది. ఎందుకంటే ఇద్దరికీ ఎవరూలేరు. నీలవేణి కూడా భారతితోపాటే అదే రూములో ఉంటూంది - గత అయిదు సంవత్సరాల నుంచీ.

"ఏంలేదు. ఎక్కడైనా ఏదైనా తప్పు చేశానేమో అని ఆలోచిస్తు న్నాను," అంది భారతి.

"అక్కడే నా కొస్తుంది. ఏం, ఏదైనా తప్పుచేస్తేగాని ఆ డ్రాగన్ మన్ని పిలవకూడదా ?"

"అదిగో అదే నేను వద్దన్నది," గదమాయించింది భారతి.

"అవన్నీ ముద్దుపేర్లు లేవోయి. త్వరగా నడు. అదిగో రెండో రిమైం డరులాగా సుబ్బయ్య వస్తున్నాడు," అంటూనే భారతి చేయి పట్టుకుని గబగబ ప్రిన్సిపాల్ రూము కేసి నడిచింది నీలవేణి.

"మేడమ్! ఇదిగో భారతి వచ్చారు" అంటూ అతి వినయంగా వెళ్ళి తన సీటులో కూర్చొపోయింది నీలవేణి.

"నీ పని అయిందిగా! నువ్వు వెళ్ళ వచ్చు. కొంచెంసేపు భారతితో కొన్ని విషయాలు చర్చించాలి నేను," అంటూనే భారతికేసి తిరిగింది ప్రిన్సిపాల్. నీలవేణి లేచింది.

ఏభయి సంవత్సరాలు దాటినా దృఢంగా ఉంటారు ప్రిన్సిపాల్. చాలా నేర్పరి అయిన మహిళ కావడంతో ఈ బోర్డింగు స్కూలుని స్పెషల్ స్కూలుగా తయారు చేసింది. తమ పిల్లలకి స్కూల్లో సీటు వస్తేనే గౌరవం అంటూ మురిసిపోతూ ఉంటారు అంతా.

"భారతీ, నీతో ఒక ముఖ్యమైన విషయం చర్చించాలని పిలిచాను," అన్నారామె ఉపోద్ఘాతంగా. "రేపు ఉదయం స్కూలుటైము లోగానే ఒక

కొత్త విద్యార్థి వస్తూందని నీకు తెలుసు కదూ? ఆ అమ్మాయి తల్లీ అన్నగారూ కూడా వస్తున్నారు స్కూలు చూడ్డానికి. ఆ సంగతే మాట్లాడాలని," అని ఆగా రామె.

"అవును తెలుసు మేడమ్. ఈ క్రిందనే మూలగది ఆ అమ్మాయి కోసం సిద్ధం చేశాం," అంది భారతి తనపట్ల ఏం లోటు లేదని.

"అదే. ఆ అమ్మాయిని గురించి ఒకటి రెండు విషయాలు నీకు చెప్పాలని. అమ్మాయి శశిరేఖ లేటు భుజంగ రావుగారి కుమార్తె. చాలా అందమైనది. ఇదివరలో ఎప్పుడూ వీధిలోకి వెళ్ళి ఏ స్కూల్లోనూ చదువుకోలేదట. ఇంటి దగ్గిరే మాష్టర్ని పెట్టి చదివించారట. ఇదొక యిబ్బందే కావచ్చు మనకి."

"ఏదైనా టెస్టుపెట్టి చేర్చుకోవచ్చు కదా?" అంది భారతి.

"ప్రస్తుతం చదువుకోసం కాదా అమ్మాయిని మన బోర్డింగుకి పంపిస్తుంట. తల్లినీ తండ్రినీ కాదని చాలా కాలంగా ఒక అనామకుణ్ణి పెళ్ళి చేసుకుంటానని పట్టుపట్టింది. తండ్రి పోవడంతో మనసు మార్చుకుంటుందని చూచారట. కాని ఆ పట్టు మంకు పట్టుగా తయారైందిట. మాట్లాడితే వెళ్ళిపోతానని బెదిరిస్తూందట. ఎదుటి అబ్బాయి ఉట్టి కులగోత్రాలు లేని వాడే కాకుండా ఈ కుటుంబానికి తలవంపులు తెచ్చినవాడని అన్నగారు చెప్పాడు. ఇక ప్రాణం విసిగి ఇలాంటి చోట ఓ ఆర్నెల్లు అట్టేపెడితేనైనా తత్వం మారుతుందేమో నని వారి ఆశ. లోకజ్ఞానం లేని పిల్లలాగా తోస్తోంది. నీ కేమనిపిస్తూంది భారతీ?" అడిగారు ప్రిన్సిపాల్.

ఏదో కట్టుకథ వింటున్నట్టు వింటున్న భారతి ఈ ప్రశ్నకి ఉలిక్కిపడింది.

"ఏ వూరు జమీందార్లు వీళ్ళు? మా ఊరుకూడా జమీందారీగ్రామమే." అడిగింది భారతి.

"అందుకే కదా నిన్ను పిలుస్తే! మీ ఊరు లేటు జమీందారుగారి అమ్మాయే శశిరేఖ—ఇంతటి నాయిక అయింది!''

భారతి నోట మాట రాలేదు. జమీందారుగారిది తరగని సంపద అని వారిని గురించి కట్టుకథలలాగా చెప్పుకోవడమేగాని కళ్ళారా చూడలేదు. వారి అబ్బాయిని మటుకు చాలాసార్లే చూసింది. అతగాడు కూడా పట్నంలో చదువుకున్నాడు. అక్కడే చూడ్డం తటస్థించింది, కాని ఎప్పుడూ మాట్లాడ లేదు.

"భారతీ, ఈ శశిరేఖతోపాటు అదే గదిలో నువ్వూ ఉండాలని నా కోరిక. ఈ క్రింది గదిలోకే నువ్వూ మారిపో. ఆ అమ్మాయితో స్నేహంగా ఉండి,

ఆ పిల్ల మనసు మార్చడానికి ప్రయత్నించు. అంతకంటే ముఖ్యం—ఇక్కడి నుంచి ఆ పిల్ల ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరాలూ జరపకుండా చూసే బాధ్యత నీది. మన హాస్టల్లో ఉండి మన పరువు తీయకుండా ఉండాలా పిల్ల. ఇదొక అగ్ని పరీక్ష అనుకో," అంటూనే కుర్చీలోంచి లేచారామె. చెప్పవలసినది అయిపోయినట్టే నని దాని అర్థంగా గ్రహించిన భారతి కూడా లేచి నిలబడింది. ఏదో తెలియని పిరికితనం ఆవహించిం దామెని. ఇంతటి బాధ్యత మోయకలనా! అనుకుంది.

"మేడమ్?" జంకుతూనే పిలిచింది.

"ఏమిటి? నువ్వీ పని చేయగలవన్న ధైర్యం నాకు ఉంది భారతీ!" అంటూ ప్రిన్సిపాల్ రూము బయటికి నడిచారు.

భారతి అరచేతులు చల్లబడ్డాయి. ముఖం కూడా పాలిపోయినట్టయిపోయింది. నెమ్మదిగా అడుగులు వేస్తూ గది దాటి బయటికి వచ్చింది. అప్పటిదాకా అవతలే వున్న నీలవేణి వచ్చి కలిసింది. భారతి ముఖకవళికలు చూసి ఆశ్చర్యపోయింది.

"ఏమైంది భారతీ? కొంపతీసి నిన్ను పెళ్ళి చేసుకుని వెళ్ళిపొమ్మందా ఏం?" సహజమైన హేళన ధోరణిలో అడిగింది నీలవేణి.

ఊరుకో నీలవేణీ! అన్నీ నీకు వేళాకోళమే!" విసుక్కుంది భారతి.

"మరేమైందో చెప్పు;" నిలదీసింది నీలవేణి.

రూమ్‌కి రా చెప్పుకుందాం. మళ్ళీ పిల్లలని వాకింగుకి తీసుకువెళ్ళే టైము అవుతూంది." గబగబ మేడ మెట్లవైపు దారి తీసింది భారతి.

గదిలో అడుగు పెట్టగానే కుర్చీలో కూలబడింది. కుర్చీలో జేరబడుతూనే "ఇప్పుడు చెప్పు," అంది నీలవేణి.


పక్కనే ఉన్న మంచం పట్టెమీద కూర్చుని ప్రిన్సిపాల్ చెప్పిందంతా చెప్పింది భారతి. "నా కేమిటో భయంగా ఉంది నీలా. తీరా చేసి ఈ శశిరేఖ ఎలాంటిదో!" అసహాయిత ధ్వనిస్తూ అంది భారతి.

"నీ కెందుకింత పిరికితనం భారతీ, మన చేతిలో ఉన్నంతవరకూ చేస్తాం. ఇంకా తెగించి ఆ పిల్ల లేచిపోతే నువ్వేం చేస్తావు? ప్రిన్సిపాల్ ఏం చేస్తారు! చివరికా అన్నగా రేం చేస్తాడు?" అంది నీలవేణి.

మామూలుగానే అన్నా, నీలవేణి మాటలు భవిష్యద్వాణిలాగా ధ్వనించాయి భారతికి.

అంత సులభంగా కొట్టిపారేస్తావేం? మనమీద ఒక బాధ్యత పెట్టాక అది మనం సరిగా నిర్వహించలేకపోతే ముఖం ఎత్తి తిరగాలా? వద్దా?" సీరియస్‌గా అడిగింది భారతి.

"బాగుందోయ్ నీ వరసా. ఏదో



సామెత చెప్పినట్టుంది. ఉట్టినే అమ్మాయినే పట్టుకు యిహెూతావేం ? ఆ అమ్మాయి కోఅన్నగారున్నారటగా?" వేళాకోలం చేసింది నీలవేణి.

"అంటే? అమ్మాయి ఏమైతేనేం గాక, వారి అబ్బాయిగారిమీద కన్నేసి ఉంచు అనా నీ బోధ? బాగుంది. నీ కెప్పుడూ ఒకటే గొడవ. పోనీ పెళ్ళి చేసుకుని త్వరగా పోదూ," అంది భారతి ఒక చేత్తో తన పొడుగాటి జడ విప్పుతూ.

"ముందు ని న్నో దారిలో పెట్టి నా దారి చూసుకోవా లని కదా నా బాధ! అసలే అమాయికురాలివి కదా! నే పోతాను. కిచెన్ డ్యూటీ పడిసింది మనకి," అని లేచింది నీలవేణి.

"నీలవేణీ!" అని కేక వేసింది భారతి.

గుమ్మం దాటపోతూన్న నీలవేణి అలాగే ఆగింది. వెనక్కు తిరిగి ఏం కథ? అన్నట్టు చూసింది.

"నీలవేణీ! ఈ రాత్రికి నన్ను క్రింది గదిలోకి మారిపొమ్మంది ప్రిన్సిపాల్. మనిద్దరం ఐదేళ్ళుగా ఈ గది పంచుకున్నాం." బాధగా అంది భారతి.

అమాంతం లోపలికి తిరిగి వచ్చేసింది నీలవేణి.

"అంటే! ఇరవై నాలుగ్గంటలూ శశిరేఖమీద నిఘా వేసిందన్నమాట! బాగుంది బాగుంది!" అంటూ భారతి చేయి తన చేతిలోకి ఆప్యాయంగా తీసుకుంది నీలవేణి, కళ్ళలోకి సూటిగా చూస్తూ.

"నువ్వు శశిరేఖకి సి. ఐ. డి. వి అయితే, నీకు నేను? జాగ్రత్త!" అని భారతని వేళాకోళం చేసింది.

"అంతేగాని ఇక మనం రూమ్ మేట్సుగా ఉండమన్న బెంగలేదు నీకు," అని బుంగమూతిపెట్టిందిభారతి.

నీకు నీడలాగా నేను వెంట వెంట ఉంటూనే ఉంటానోయి. ఆ పిల్లకొద్ది కాలంపాటేగా ఇక్కడుంటుంది? అ పిచ్చి కుదరగానే పెళ్ళి చేసేస్తారులే. మళ్ళీ మనం మామూలే. రాత్రికి మాట్లాడుకుందాం. నే పోతాను," అంటూ వెనుతిరిగి చూడకుండా గబ గబ అవతలికి వెళ్ళిపోయింది నీలవేణి.

## 2


భారతి అల్లిబిల్లిగా అల్లుకొంటున్న ఆలోచనలు కట్టిపెట్టింది. తల దువ్వు కొని బట్టలు మార్చుకుంది. జోళ్ళు తొడిగి కిందికి దిగింది. అప్పటికీ భారతి జట్టు పదిహేనుగురు అమ్మాయిలు రక రకాల వేషాల్లో ముందుతోటలో ఉన్నారు. స్కూలు ఆవరణ దాటడం అంటే ఎందుకో వీళ్ళ కింత ఉత్సాహం అని నవ్వుకొంది భారతి. బాధ్యతలు తెలియనివాళ్ళు! ప్రపంచములోకి వెళ్ళాక ఎటువంటి జీవితాలు వీళ్ళకి లభ్యం అవుతాయో కదా?

"మిస్! మీకోసమే చూస్తున్నాం. నడవమా?" ఓ పది కంఠాలు ఒకే సారి పలికాయి.

"సరే బయలుదేరండి," అని గేటు వైపు దారితీసింది భారతి.

ప్రకృతి రమణీయతకి పుట్టినిల్లుగా వుంటుంది స్కూలు. చుట్టూ చిన్న చిన్న గుట్టలు, ఏమిటో ఎప్పటివో తెలియని శిథిలాలు ఒకటి రెండు స్కూలుకి రెండుమైళ్ళ దూరంలో ఉన్నాయి. అవి దాటితే కళ్ళకి చల్లగా పచ్చని పొలాలు పరుచుకుని కనిపిస్తాయి. వాటి గట్లవెంట కబుర్లు చెప్పుకుంటూ, పాటలు పాడుకుంటూ గోలగోలగా నడుస్తారు అమ్మాయిలు. వారిని కనిపెడుతూ తన ఆలోచనలలో తను మునిగితేలుతూ నడుస్తుంది భారతి. రోజూ సాయంత్రం ఇది అలవాటైన కార్యక్రమం. శిథిలమైన కోటగుమ్మం లాంటిదికూడా ఒకటి వుంది దారిలో. దాన్ని వెళ్ళేటప్పుడు 'స్వర్గద్వారం' అంటారు అంతా సరదాగా. ఎందు కంటే స్కూలునుంచి బయటకి నడి పిస్తోంది కనుక. అదే గుమ్మం అటు నుంచి తిరిగివచ్చేటప్పుడు నరకద్వారం ఆయిపోతుంది. స్కూల్లోకి తిరిగి వెళ్ళి పోవాలికదా మరి! వాళ్ళ మాటలు, చేష్టలూ వింటూ చూస్తూ తనలో తను నవ్వుకుంటూ నడుస్తోంది భారతి.

భారతి రాబోయే శశిరేఖను గురించి ఆలోచిస్తూ పిల్లలవెంట నడు స్తోంది. ఒక అమ్మాయి భారతి దగ్గ రగా వస్తూ, "రేపో కొత్త స్టూడెంటు



"ఆఁ! ఏమంటారు? ఈ లిప్‌స్టిక్ కారిపోతుందా! మీరు కావాలంటే వేసుకు చూడండి. నేను రాలదని ప్రత్యక్షంగా నిరూపిస్తాను."

---

వస్తుందట—మీకు తెలుసా మిస్?" అని అడిగింది—క్యూరియాసిటీ అణచుకోలేక.

"తెలుసు. మన జట్టుకే వస్తుంది. మీరంతా ఆ అమ్మాయితో సరదాగా ఉండాలి. ఆ పిల్ల కిక్కడ అంతా కొత్తగా ఉండొచ్చు," అంది భారతి.

"ఏం మిస్! ఇదివర కెక్కడ చదివిందట?"

"ఏ స్కూలుకీ వెళ్ళి చదువుకున్న అమ్మాయి కాదు. జమీందార్ల అమ్మాయి. ఇంట్లోనే చదువుకుందిట. అందుకే మీరంతా ఆ పిల్లని అదర కొట్టక, నెమ్మదిగా స్నేహంగా మాట్లాడండి," అంది భారతి.

"అలాగే మిస్," అంటూ ముందుకి పరుగుతీసిం దా అమ్మాయి. ఈ విశేషా లన్నీ మిగిలిన పిల్లలకి చెప్పాలిక దా.

స్వర్గద్వారం దాటేశారు పిల్లలంతా. వాళ్ళ గోల విని తలెత్తి చూసింది భారతి. ఒక్క పరుగున కోట గుమ్మం దాటి ముందుకు పరుగెత్తుతున్నారు అమ్మాయిలు. వాళ్ళ సంతోషానికి నవ్వు వచ్చింది. ఆ శిథిల ద్వారానికి ఒక పక్కగా ఠీవిగా ఒక యువకుడు నిలబడివున్నాడు. "మిస్ స్వర్గద్వారం దాటేశాం," అంటున్న అమ్మాయిల కేక అలా పెదవుల మీదే ఆగిపోయింది. వాళ్ళకి పాతిక గజాల

దూరంలో ఉంది భారతి. అడుగులు త్వరగా వేసి గుమ్మం చేరింది. "క్షమిం చండి," అంటూ భారతి దారికి అడ్డుగా నిలచాడు యువకుడు.

"మీకేం కావాలి?" లోపల బితుకు బితుకు మంటున్నా, పైకి గంభీరంగా అడిగింది భారతి. అడుగుతూనే గుమ్మం దాటింది. అతగాడు వెంట వస్తూ—

"నేను కొంచెం దూరపు వూరు నుంచి వచ్చినవాణ్ణి. ఇక్కడ ఏదో స్కూలుందని విన్నాను. వివరాలు తెలుసుకోవాలి. కొంచెం దారి చూప గలరా?" ఎంతో మర్యాదగా అడి గాడు. తలెత్తి అతని ముఖంలోకి చూసింది భారతి. చిలిపిగా నవ్వుతు న్నట్టున్నాయి అతని కళ్ళు. సన్నని నవ్వు వెల్గింది పెదవులమీద. అతని వ్యక్తిత్వానికీ, ధరించిన దుస్తులకీ పోలికలేదు. చాలా మాసిన బట్టలు ధరించాడు. పాంటు అంచులు నలిగి దారపుపోగులు రేగిఉన్నాయి. షర్టు కాలరుకూడా అలాగే ఉంది. ఈ మాసిన బట్టలమీద ఆ కోటుకూడా ఎందుకో అనుకుంది భారతి.

"మీరు నడుస్తూ ఉండండి," అని పిల్లలను హెచ్చరించి, గుమ్మం ఇవత లికి నడిచివచ్చింది భారతి.

"చూడండి, ఇదిగో ఈ కాలిబాట రెండుగా చీలిందే — ఆ లెఫ్టుకి మళ్ళి తిన్నగా నడిచారంటే స్కూల్ను గేటు చేరుతారు. లోపలికి కబురు పంపండి. ప్రిన్సిపాల్ ఉంటారు," అని చెప్పి వెనక్కు మళ్ళబోయింది భారతి. భారతి చెయ్యి మెరుపులాగా పట్టు కున్నాడా యువకుడు. ఈ హఠా త్సంఘటనకి బిత్తరపోయింది భారతి.

మరుక్షణంలో "ఏం లేదు, మిమ్మల్ని భయపెట్టాలని కాదు నా ఉద్దేశం. నా కా స్కూలు తెలుసు. రేపు అక్కడ చేరబోయే కొత్తస్టాఫెంటూ తెలుసు. దయచేసి ఈ ఉత్తరం ఆమెకి అందిం చండి. అందుకే ఆపాను," అంటూనే ఒక కవరు ఆమె చేతిలోపెట్టి చకచక ముందుకి సాగిపోయాడు ఆయువకుడు.

"ఏమిటీ దారుణం? నేను ఇవ్వను," అని భారతి అంది. కాని అప్పటికే కాలిబాటవెంట చాలా దూరం సాగిపోయాడా యువకుడు. వంచిన తల ఎత్తకుండా చక చక నడుస్తూ పోతున్నాడు యువకుడు.

బొమ్మలాగా నిలబడిపోయిన మిస్‌ని మాటా మంతీ ఆపేసి చూస్తు న్నారు అమ్మాయిలు. అప్పటికి గాని భారతికి తెలిసిరాలేదు — అందరూ తన చేతిలో ఉన్న కవరుకేసే చూస్తున్నా రని. అదరాబాదరాగా చేతిలో కవరు మడుస్తూ 'నడవండి పోదాం' అంటూ స్కూలుకేసి మళ్ళించింది పిల్లలని.

వెనక నడచివస్తున్న పిల్లలు ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ, 'మిస్‌కి



లౌలెటర్' అంటూ భారతి చెవికి వినీ వినబడనట్టు వ్యాఖ్యానిస్తున్నారు. సిగ్గుతో భారతి ముఖం ఎర్రబడింది.

ఎండవేడి కూడా తగ్గిపోయింది. ప్రకృతి అంతటిమీదా బంగారుపూత పూసింది నీరెండ. గాలికి తల లూస్తున్నాయి చెట్లు. వైరుమీద గాలికెరటాలు గమ్మత్తుగా కదలుతున్నాయి.

భయంతో గుండెలు దడదడా కొట్టుకుంటున్నాయి భారతికి. ఇప్పు డేం చెయ్యడం? శశిరేఖకు తగిన తెగింపు ఉన్నవాడిలాగ ఉన్నాడే! అసలీ

స్కూలుకి శశిరేఖని పంపిస్తున్నా రని ఇతగాడి కప్పుడే ఎలా తెలిసింది? ఈ ఉత్తరం ఇవ్వాలా? వద్దా?...ప్రశ్నల పరంపరలు చెలరేగుతున్నాయి భారతిలో. లోపల పీడిస్తున్న భయంతో అడుగులు గబగబ పడుతున్నాయి. అమ్మాయి లంతా సన్నగా నవ్వుకుంటున్నారు. 'మిస్‌కి ఉత్తరం చదవాలని ఆత్రం' అని వ్యాఖ్యానిస్తున్నారు. అంతా ఒక్కసారిగా నవ్వుతూ స్కూలు ఆవరణలోకి పరుగెట్టారు.

ప్రశాంతంగా ఆలోచిస్తేగాని బుర్ర పనిచేసేలా లేదని తిన్నగా తన రూములోకి వెళ్ళింది భారతి.

ఆ ఉత్తరం ఓ పాముల బుట్టలాగా ఉంది ఆమె ప్రాణానికి. పెట్లో పడేసింది. కళ్ళు మూసుకుని పడుకుంది. జీవితంలో ఎప్పుడూ గట్టి సమస్యలని ఎదుర్కొని భారతి కిది విషమసమస్య అయింది. ఉత్తరం ప్రిన్సిపాల్‌కి ఇస్తే, ఎందుకు పుచ్చుకున్నావు? అంటుందని భయం. ఏం చేయాలి? అన్న ఆలోచనలు చుట్టుముట్టి నీరసం వచ్చినంత పనయింది భారతికి.

రాత్రి భోజనంకూడా చేయబుద్ధి పుట్టలేదు. కాని నీలవేణి పోరు పడలేక భోజనానికి దిగివచ్చింది. అమ్మాయిలంతా భారతిని దొంగచూపులు చూస్తున్నారు. వాడిపోయిన భారతి ముఖం చూసి 'పాపం, విరహం' అంటూ నిట్టూరుస్తున్నారు. భారతి వెనక చిలిపిగా డ్యూయెట్లు పాడుతూ వేళాకోళాలు చేసుకుంటూ నడుస్తున్న పిల్లలని చూసి ఏదో వుంది అనుకుంది నీలవేణి.

రాత్రి భోజనం తరువాత భారతి సామాను క్రిందిగదిలోకి మార్చేశారు. కాని రాత్రి తన పాతగదిలోనే గడపాలనుకుంది భారతి.

"ఏం అదోలా ఉన్నావు? శశిరేఖని గురించా? ఆమె అన్నగారిని గురించా నీ ఆలోచనలు?" వేళాకోళంగా అడిగింది నీలవేణి.

'నీలవేణికి ఉత్తరం సంగతి చెప్తేనో?' అని ఓ క్షణం ఆలోచించింది భారతి. కాని రేపు ఉదయం పరిస్థితులనుపట్టి ఆలోచించి నిర్ణయించవచ్చు అనుకుంది. అందుకే నీలవేణి మాటకి సన్నగా నవ్వుతూ "ను వ్వేం అనుకుంటున్నావు నీలవేణీ!" అని అడిగింది.

"అబ్బా! చిలుక పలుకు పట్టిందే—ఏదో వుంది. నువ్వు చెప్పితీరాలి," అంటూ పట్టుపట్టింది నీలవేణి.

'రేపు చూద్దాం' అనే ధైర్యం రాగానే ఎంతో హాయి అనిపించింది భారతికి.

"నేను పట్నంలో చదువుకునే రోజుల్లోనే శశిరేఖ అన్నగారు సూర్యారావు బహదూర్ కూడా సిటీలో

చదువుకునేవాడు. మహా ముక్కోపి అని చెప్పేవారు. చాలా అందంగా ఠీవిగా ఉంటాడని అమ్మాయిలం అనుకునేవాళ్ళం. కాని అతనికి కళ్ళు నెత్తిమీద ఉంటాయి అని వినికిడి," అంది భారతి.

"అదా నీ కోపం? పోనీలే; తన చెల్లెలి రక్షణ బాధ్యత నువ్వు వహిస్తున్నావుగా? గెలిస్తే నీ కొప్పులో కొత్త తురాయే," అంది నీలవేణి.

"నీ మొఖం. అతని సంగతి నీకు తెలియదు. నాన్నగారు పోయినప్పుడు ఎస్టేటు గుమాస్తాని పంపాడు పరామర్శకి. ఏం, వచ్చి చూసిపోలేడా? ఉన్నన్నాళ్లూ నాన్నగారు రా ఊళ్లో ఎంతో గౌరవంగా బ్రతికారు. చిన్నా పెద్దా అంతా అభిమానించారాయన్ని. ఎంత జమీందారయితే మటుకు? మానవ మర్యాదలకి అతీతుడా?" అంది భారతి.

"అమ్మతల్లీ! నా మీద చూపిస్తావేం ఆవేశం. రేపో రుక్మిణమ్మతో వస్తాడుగా—ఆ రుక్మిణి నడిగితే సరి!" అంది నీలవేణి.

"అయ్యబాబోయి; ప్రిన్సిపాల్ ముందు మాట్లాడ్డమా? అదీ కాక నన్నెప్పుడూ పలకరించని వ్యక్తిని నేనుమటుకు ఎందుకు పల్కరిస్తాను? అతనికి జమీందారీ ఉంటే మనకి ఆత్మాభిమానం లేదా ఏం?" అంది భారతి.

"ఇంతకీ నువ్వు అనేది ఏమిటోయ్ వెర్రి తల్లీ! నన్నుగానీ సంధి చేయమంటావా?"

చిరుకోపం వచ్చింది భారతికి.

"నువ్వేం చేయక్కరలేదు. నువ్వు చుట్టుపక్కల కనబడకుండా ఉంటే నా తలమీద పాలు పోసినట్టే భావిస్తాను," అని వత్తిగిలి పడుకుంది భారతి.

పడుకున్న నీలవేణి లేచి వెళ్ళి భారతి పక్కలో కూర్చుంది. "ఏయ్, ఈ రోజు ఏమైంది నీకు? సాయంత్రం మైరు వెళ్ళివచ్చిన దగ్గిరనుంచీ చూస్తున్నాను. నా దగ్గిర ఏదో దాచాలని చూస్తున్నావు. అవునా?" నిలదీసింది.

ఓ క్షణంపాటు అదరిపడ్డా, కుదుట పడింది భారతి. "ఏం లేదే; మామూలుగానే మేం వెళ్ళే దారివెంట స్వర్గద్వారం దాటాం. నరకద్వారంలోంచి తిరిగి వచ్చేశాం. అంతేనే," అంది అమాయికంగా.

"కొయ్; ఏదీ ఇటు చూడు—చెప్పు" అంది నీలవేణి. అప్పటిదాకా మేకపోతు గాంభీర్యం ప్రదర్శించిన భారతి నీరు కారిపోయింది. నీలా, నా కేమిటో ఒకటే భయంగా ఉంది. కనీసం నీతోకూడా ఉంటే కష్టం సుఖం చెప్పుకుందుం. ఇప్పుడు ఇరవై నాలు గ్గంటలూ శశిరేఖ! ఎలాగ నీలవేణీ?" అంటూ నీలవేణి వడిలో తల దూర్చి

ఏడ్చేసింది భారతి. భారతి తల నిము రుతూ కూర్చుంది నీలవేణి.

"నువ్వీ రోజు ఏదో చెప్పకుండా దాస్తున్నావు. ఫరవాలేదులే. అవసరం అనుకున్నప్పుడు నువ్వే చెబుదువుగాని- నీ కెందుకు భయం? నేను ఇక్కడే ఉంటానుగా," అంది అనునయంగా.

హఠాత్తుగా తన చేయి పట్టుకున్న యువకుడూ అత నిచ్చిన ఉత్తరం కలిసి భారతి కా రాత్రి నిద్ర లేకుండా చేశాయి. నీలవేణి చేయి తన రెండు చేతులతో గట్టిగా పట్టుకుని అలా ఆమె వడిలోనే కలతనిద్దర పోయింది భారతి.

## 3

కొందరికి తెల్లవారితే పని ఉంటుం దని, తెల్లవారకుండా ఉంటుందా? భారతికి ఇంకా నిద్రమైకం పూర్తిగా వదలనే లేదు.

"ఏడు గంట లయింది. లే లే," అంటూ లేపేసింది నీలవేణి.

"కళ్ళు తెరుస్తూనే నీ ముఖం చూశాను. ఫలితం ఎలా ఉంటుందో," అంటూ మంచంమీద లేచి కూర్చుంది భారతి.

"నీ ముఖమే అద్దంలో చూసుకో. ఎందుకేనా మంచిది. ఆ కళ్ళు చూడు," అంటూ అద్దం ముందు కూర్చుని అల్లిన జడలని తిప్పి తిప్పి సిగలాగా చుడుతూంది నీలవేణి. ఆఫీసులో పని చేస్తున్నప్పుడు వాలుజడ వీలుగా ఉండదని నీలవేణి నమ్మకం. మాటకి ముందు భుజంమీదినుంచి జడ ముందుకి పడుతూ ఉంటే, టైపు చేయడం ఎలాగ? ప్రిన్సిపాల్‌కి ఏవైనా కాగి తాలు చూపడం ఎలాగ? అని చక్కగా సిగ చుట్టుకుంటుంది. అంతే కాదు, నూలు చీరలు తప్పించి ఆఫీసుకి వేరే రకాలు కట్టుకోదు, 'కొంగు జార్చు కొంటూ తిరగడం సభ్యత కాదు;' అంటారు ప్రిన్సిపాల్. నూలు చీర అయితే మనసుకి విశ్రాంతిగానూ ఉంటుంది. (అస్తమానూ గుండెల మీద చేయివేసి సర్దుకోవడం బాగుం టుందీ?) చక్కగా నడుము దగ్గర దోపేస్తే హాయిగా పని సాగుతుంది. ఎనిమిదిన్నర అయేసరికి ఆఫీసురూంలో ఉంటుంది నీలవేణి. అందుకే అంత ఉదయాన్నే లేచి సిద్ధం అవుతూంది.

"నీ హడావిడి చూసి ఈ ఉద్యో గానికి ఎంత దూరం ప్రయాణం చెయ్యాలో అనుకుంటారు," అంది బద్ధ కంగా వళ్ళు విరుచుకుంటూ భారతి.

"మైళ్లు ప్రయాణం చేసి వెడితేనే ఉద్యోగమా ఏం? నా ఇంట్లో క్రింద ఆఫీసు ఉన్నా సరే నేను టంచన్‌గా వెళ్ళితీరతాను; తెలుసా?...అది సరే గాని, ఈ రోజు చాలా ముఖ్యమైన రోజన్న సంగతి మరిచిపోయావా?" అంది నెమ్మదిగా.



"మైగాడ్! మరిచే పోయాను. నేనూ అర్జెంట్‌గా ఫెమిలి క్రిందకి వచ్చేస్తాను." అంటూనే హడావిడిగా బాత్‌రూమ్‌లోకి దారి తీసింది భారతి.

నీలవేణి అప్పటికే తన పని ముగించింది. హేండ్‌బాగ్ అందుకుంది. జోళ్లు తొడుక్కుంది రూము తలుపు దగ్గరగా వేసి మెట్లకేసి నడిచింది.

ఉదయం భారతి తెచ్చిలి తల దువ్వుకుందుకు కూర్చునే సరికే తొమ్మిది కొడుతూంది. ఆదరాబాదరాగా చిక్కు తీసి జడ అల్లుకుంటూంది. నీలవేణి ఒక్క పరుగున వచ్చింది "ఇంకా ఇక్కడే ఉన్నావా? మేడమ్ నిన్ను అర్జెంటుగా తీసుకురమ్మన్నారు. ఓయ్, మనలో మన మాట, కొంచెం ధైర్యంగానే ఉండు," అంది రహస్యం చెప్తున్నట్టు.

"ఏం వాళ్ళు వచ్చేశారా?" గాభరాగా అడిగింది భారతి.

"ఆహాఁ, వచ్చేశారు నీ విద్యార్థినిని కారులోంచి దింపడమే బ్రహ్మప్రళయం అయింది చాలా మొండిఘటంలాగా ఉంది. అసహ్యంగా ఏడుస్తూంది," అంది నీలవేణి

"నిజంగానా?' చాలా నీ సంగా అడిగింది భారతి

"తినబోతూ రుచు లెందుకు? పద," అంటూ భారతిని వెంట పెట్టుకుని బయలుదేరింది క్రిందికి

"అంతా డ్రాయింగ్ రూములో ఉన్నారు. నువ్వు వెళ్ళు నేను ఆఫీసు రూంకి పోతాను," అని తన ఆఫీసు గది కేసి నడిచింది నీలవేణి

విశాలమైన డ్రాయింగు రూము గుమ్మంలో నిలబడింది భారతి లోపలి దృశ్యం చూసి చలించిపోయింది తల్లి వళ్ళో ముఖం దాచుకుని బావురని ఏడుస్తూంది శశిరేఖ. నిస్సహాయంగా కూతురి తల నిమురుతూ కూర్చుంది తల్లి సోఫా వెనకగా నిలబడి ఉన్నాడు శశిరేఖ అన్నగారు ఎదుటి సోఫాలో కూర్చుంది ప్రిన్సిపాల్. "కమిన్ భారతీ. మీట్ యువర్ న్యూ చార్జ్!" అంటూ భారతిని ఆహ్వానించింది ప్రిన్సిపాల్.

"ఈమె భారతి. హాస్టల్ చూసుకునే ముగ్గురిలో ఒకామె," అంటూ భారతిని పరిచయం చేసింది.

"వీరే నేను నిన్న చెప్పినవారు," అని భారతికి వారిని పరిచయం చేసింది.

"నమస్కారం," అంది భారతి.

భారతి వంక బిత్తరపోయి చూస్తున్నాడు శశిరేఖ అన్నగారు. ఆ చూపులో పెద్ద ఆశ్చర్యం లేదు ఈ అర్భకురాలు నా చెల్లెలి రక్షణభారం వహించడమా! అన్న ఊహ తప్పించి వేరు లేదా చూపులో

"మేడమ్! వయస్సులో కొంచెం పెద్దవా రెవరైనా శశిరేఖకి తోడుగా ఉంటే బాగుంటుందేమో," అన్నాడు ప్రిన్సిపాల్ కేసి తిరిగి

ఈ మాట విని భారతి ముఖం జేవురించింది

"మీ కాభయం అక్కర లేదు భారతి వయస్సులో చిన్నది అయినా, దృఢమైన నమ్మకాలు కల మనిషి. ఆమెలో నాకు నమ్మకం ఉండబట్టే ఆమె కప్పగించా నీ బాధ్యత," అన్నారు ప్రిన్సిపాల్.

"అలా అనకూడు. శశిరేఖని చూస్తున్నారుగా! దీన్ని ఓ పట్టాన మార్చడం ఒకరి తరం కాదు," అన్నాడు

"నువ్వూరుకో సూర్యం. ఆవిడ నమ్మకంగా చెప్తున్నారుగా," వినీ విన బడ నంత నెమ్మదిగా అన్నారు కూతురు తల నిమురుతూన్న తల్లి

ఈ మాట విని దెబ్బతిన్న తాచు లాగా తల విదిల్చి అన్నగారి ముఖం లోకి చూసింది శశిరేఖ

"ఊరుకోవడం ఎందుకూ ? నా గురించి చెప్పు. ఇంకా చెప్పు నా కాళ్ళకి గొలుసులు వేసి కట్టమను గదిలో తాళం వేసి ఉంచమను," అంటూ ఆవేశంగా అరిచింది. 'ష్' అన్నారు ప్రిన్సిపాల్. ఆ కోపాన్ని చూసి అదరి పడింది భారతి చిన్నగనవ్వి 'చూశారా, ఇదీ వరస' అన్నట్టు చేయి చూపించాడు అన్నగారు

మళ్ళీ తల్లివడిలో ముఖం దాచుకుని వెక్కి వెక్కి పడుతూ ఏడుపు సాగించింది శశిరేఖ "నన్నిక్కడ ఉంచకమ్మా నన్ను చంపెయ్; అంతేగాని నన్ను ఇక్కడ వదలిపోకు,' అంటూ పసిదానిలాగా ఎక్కపడుతూ తల్లిని ప్రాధేయపడుతూన్న శశిరేఖని చూస్తే జాలి ముంచు కొచ్చింది భారతికి ఎప్పుడూ ఎవరినీ గాఢంగా ప్రేమించడమంటే ఏమిటో తెలియదు భారతకి తండ్రే లోకంగా బ్రతికిన భారతికి ఈ ప్రేమకోసం పంతాలూ ఏడ్పులూ గమ్మత్తుగా తోచాయి 'తనకు కావాలనుకున్న వాణ్ణి వద్దంటే ఎంతబాధగా ఉంటుందొ కాబోలు! పిచ్చిపిల్ల!'

"ని నాటకం ఇంక చాలు. లేచి సరిగ్గా కూర్చో," అని ఒక్క కసురు కసిరాడు సూర్యారావు. అదరిపడి లేచి కూర్చుంది శశిరేఖ. అమ్మాయి కళ్ళు ఏడ్చి ఏడ్చి ఎర్రపడ్డాయి. అన్నగారిమీద కోపంతో వింతగా వెల్గుతున్నాయి

"ఛీ, నిన్ను చూస్తేకూడా అసహ్యం వేస్తుంది అసలు నువ్వు మనిషివా ? రాయివా' ఆ గుండెల్లో ప్రేమా, దయా లాంటి వాటి కెక్కడ చోటుంది ? ఎప్పుడూ డబ్బూ, హోదా, వంశం, వల్లకాకూ, ఛీ, నీతో అసలు మాట్లాడ కూడదు," అంది శశిరేఖ. మణికట్టుతో కళ్ళువత్తుకుంటున్న శశిరేఖ ఆ క్షణంలో చాలా పసిపిల్లలాగా తోచింది భారతికి లోకజ్ఞానం లేదు అసలా వయస్సులో మంచీ చెడూ లోకం అలాంటివి తోచవు కాబోలు !

"పోనీ లే, నాతో నీ కా బాధ లేకుండానేగా ఇక్కడికి తీసుకు వస్త! నిశ్చింతగా ఉండు," అంటూ ప్రిన్సిపాల్ కేసి తిరిగాడు సూర్యారావు.

"తప్పు శశిరేఖా, నువ్విలా పెద్దవారిని అనకూడదు. వాళ్ళు ఏం చేసినా నీ మంచీ, నీ సుఖం కోరేకదా చేస్తారు నీ గది చూపిస్తాను," అంటూ ఆహ్వానించింది భారతి

"నెమ్మదిగా తీసుకు వెళ్ళు అమ్మాయీ! శశిరేఖ చాలా గరాబంగా పెరిగింది అభంశుభం తెలియదు. తనకి ఎంతతోస్తే అంతే,"

అంటూ పొంగివస్తున్న దుఃఖాన్ని దిగమింగే ప్రయత్నంతో కొంగు నోటికి అడ్డు పెట్టుకున్నారు జమీం దారిణి.

"ఫరవాలేదండీ! కొత్తచేత ఇలా ఉందిగాని ఓ నెల పోయాక వచ్చి చూడండి - మీ అమ్మాయిలో ఎంత మార్పు వస్తుందో," అని సమాధానం చెప్పి శశిరేఖ చేయి అందుకుంది భారతి

సూర్యారావు తదేకంగా భారతినే చూస్తున్నాడు. భారతి తీరులో అతని కేదో ధైర్యం చిక్కినట్టయింది. "థ్యాంక్యూ. మీరు తీసుకువెళ్ళండి. మా చెల్లెలు మీకు మరీ శ్రమయివ్వ దనే అనుకుందాం," అని చిరునవ్వు నవ్వాడు.

మండిపడుతూ చూసింది అన్నగారి వైపు శశిరేఖ. తల్లి ఏమీ అనకపోయే సరికి నిస్సహాయంగా భారతి వెంట నడిచింది.

శశిరేఖా భారతీ గుమ్మం దాట కుండానే దీర్ఘంగా నిట్టూర్చి ఒక సోఫాలో కూలబడ్డాడు సూర్యారావు ప్రిన్సిపాల్, తల్లీ, కొడుకూఎవో సంగ తులు చర్చించటం ప్రారంభించారు.

వరండాకి ఒక చివర వున్న గది కేటాయించారు భారతికీ శశిరేఖకీ కలిసి. శశిరేఖని ఆ గదిలోకి నడిపిం చింది భారతి. గదిలో అడుగు పెట్టడం తరవాయిగా, భారతి భయపడేటట్టుగా రోదన ప్రారంభించింది శశిరేఖ. ఓదార్చాలని చేసిన భారతి ప్రయ త్నాలు వృథా అయ్యాయి. ఎలాగ, ఎలాగ అని తల బద్దలుకొట్టుకుని చివరికి - చిన్నపిల్లకి 'తాయిలం పెడతా అల్లరి చెయ్యకు' అన్నట్టు "నువ్వు ఏడుపు మానేసి నాకేసి చూస్తే ఒక బహుమానం ఇస్తాను శశిరేఖా," అంది భారతి.

తలెత్తి చూసింది శశిరేఖ

నాకీ బ్రతుకు అక్కరలేదండీ. నేనెలాగైనా చచ్చిపోతాను. మా అన్నయ్య ఏదో అనుకుంటు న్నాడుగాని......ఇక్కడినుంచి ఇక నా •వమే వెడుతుంది," అంది.

"అలా అనకూడదు. మరీ అంత బెంబేలు పడిపోతే ఎలాగ? నువ్వేం చిన్నపిల్లవా? కొంచెం ఆలోచించి చూడు. నీ ఈ మూర్ఖపుపట్టూ, ఏడుపూ మూలంగా నీ మీద జాలి కూడా పోతుంది అందరికీ,'' అంది భారతి.

"నన్నేం చెయ్యమంటారు? నేను మోహన్‌ని తప్పించి ఎవరినీ పెళ్ళి చేసుకోను. చచ్చేనాపోతాను...... చూడండి. ఏదో బహుమానం అన్నారే, అదేదో కొంచెం విషం యిచ్చి పుణ్యం కట్టుకోండి," అంటూంటేనే దుఃఖంతో పూడుకుపోయింది శశిరేఖ కంఠం.

దగ్గరగావెళ్ళి తల నిమురుతూ

నిలబడింది భారతి. "నువ్వు ఏడుపు మానేసి సరదాగా ఇక్కడ ఉంటా నంటే..." అని ఆగింది భారతి. ఆమె మనస్సులో క్రిందటిదినం యువ కుడు ఇచ్చిన ఉత్తరం మెదులుతూంది. 'ఇస్తే ఇప్పటికి ఈ గండం గడుస్తుంది. శశిరేఖ కొంచెం స్థిమితపడి సర్దుకుం టుంది తరువాత చూసుకోవచ్చు-' అని నిర్ణయించుకుంది భారతి పెట్టె దగ్గరకు వెళ్ళి వుత్తరం బయటికి తీసింది తను చేస్తున్న పని తప్పు 'అయినా ఇదొక్కటిమినహా శశిరేఖని ఉపశమింప చేసేది ఇంకొకటి లేదు ప్రస్తుతానికి,' అని సమర్థించుకుంది భారతి

చూడు శశిరేఖా ఈ చేతివ్రాత నీకు తెలుసా?" అంటూ కవరు చూపె ట్టింది

శశిరేఖ ఆ కవరుని దూరంనుంచే చూసింది

మరుక్షణంలో మెరుపులా గా భారతి చేతిలోని కవరు లాక్కుని కూర్చుంది తదేకంగా ఆ చిరునామా చూసింది. దోసిట ఆ కవరు పెట్టుకుని ముఖం కప్పుకుంది అదో ప్రాణం పోసే సంజీవ అన్నట్టు, పెదవులలో మృదువుగా తాకింది ఇంతట్లో అది ఇచ్చిన భారతి జ్ఞాపకం వచ్చినట్టుంది. అమాంతం లేచివచ్చి భారతిని కౌగ లించుకొంది. చెంపలు ముద్దు పెట్టు కుంది.

"మీరే నా ప్రాణం. ఇక ఒక్క క్షణం కూడా మీకు దూరంగా ఉండను," అంటూ భారతిని ఉక్కిరి బిక్కిరి చేసింది. ఓ ఉపద్రవం గడిచి నందుకు 'అమ్మయ్య' అనుకుంది భారతి కాని మనస్సులో ఒక మూల సూర్యారావు తల్లినీ, తనపై ఎంతో నమ్మకం ఉంచిన ప్రిన్సిపాల్‌నీ వంచి స్తున్నానా అన్న ఊహ తల ఎత్తింది.

'ఈ ఒక్కసారే. శశిరేఖను ఇక మంచిదారిన పెట్టగలను,' అని నచ్చ చెప్పుకొంది భారతి.

"పోయి ముఖం కడుక్కొని రా శశిరేఖా, నేను వెళ్ళి కాఫీ తెచ్చి పెడ తాను," అంది

మారుమాట లేకుండా బాత్‌రూం లోకి నడిచింది శశిరేఖ 'అక్కడ నిశ్చిం తగా ఉత్తరం విప్పి చదువుకుంటుంది' అని నవ్వుకుంది భారతి-డ్రాయింగు రూము కేసి నడుస్తూ

ప్రిన్సిపాల్ వచ్చినవారిని సాగ నంపడానికి లేచి నిలబడి ఉన్నారు భారతిని చూడగానే "ఎలా వుంది భారతీ?" అని అడిగారు

"ఫరవాలేదు మేడమ్. ఎడ్జెస్టు ఐపోతుంది. మీ రేం బెంగపడకండి," అంది నెమ్మదిగా.

"థ్యాంక్యూ మేము రెండు నెలల

పాటు అటువైపు రానే రాము,'' అన్నాడు సూర్యారావు

"అదే మంచిది" అంది భారతి.

వారి దగ్గిర సెలవు తీసుకుని వంటింటివైపు వెళ్ళింది భారతి కిచెన్ లోంచి కాఫీ కప్పుతో తిన్నగా రూంకి నడిచింది రూములోకి అడుగు పెట్ట గానే భారతిని నిలబెట్టేసింది అక్కడి దృశ్యం—గుండెలమీద ఉత్తరం పెట్టు కుని గది కప్పుకేసి చూస్తూ పడుకుని ఉంది శశిరేఖ.

కాఫీకప్పు తీసుకు వెళ్ళి అందిం చింది భారతి

'థ్యాంక్యూ' అంటూ అందుకుంది శశిరేఖ.

ఎదుటి కుర్చీలో కూర్చుంది భారతి ముందురోజు హఠాత్తుగా తలెత్తిన అలజడి అంత హఠాత్తుగానూ సమసి పోయినట్టనిపించింది భారతికి

## 4

శశిరేఖ హాస్టల్‌లో సాఫీగా రోజులు గడపడం అలవాటు చేసుకుంది. మిగి లిన పిల్లలతో కలిసిపోయింది భారతి జట్టుతో కలిసి సాయంత్రం షికారుకి వస్తూండటం కూడా మామూలు అయి పోయింది ఎన్నో కబుర్లు చెప్పేది ఎంతో ఉత్సాహంగా కనబడుతూంది. ప్రిన్సిపాల్ కూడా చాలా సంతోష పడింది కాని నీలవేణి మటుకు ఒక రోజు భారతిని తోటలో నిలవేసింది.

"చూడు భారతీ! నీ సెంపుడు స్టూడెంటుని ఒక కంట కనిపెట్టు. దిగుడుబావి లాగా లోతు తెలియ నీయనిరకం." అంది.

"అదేం లేదు నీలవేణీ! ఎందు కొచ్చిన పీడ అని అన్నీ మరిచిపోయి హాయిగా ఉంటుందని నా ఉద్దేశ్యం. నీ కసలా అనుమానం ఎందు కొచ్చింది," అడిగింది భారతి

"రోజు కో ఉత్తరం చెల్లిగారికి పోస్టుబాక్సులో వ దేస్తూం దట. సుబ్బయ్య చెప్పాడు అలా ఉంచు; వాళ్ళ అన్నదగ్గిరనుండి వారాని కో ఉత్తరం వస్తూనాన్న, రోజూ వ్రాయ డానికి విశేషాలు ఏముంటాయి — అది ప్రేమ లేఖ కాకుంటే?" అడిగింది నీలవేణి ఇంతట్లోనే ప్రిన్సిపాల్ ఆఫీసు రూములోకి వెళ్ళడం చూసి ఒక్కపరుగున వెళ్ళిపోయింది నీలవేణి.

అనుమానం తలెత్తిన భారతి గది లోకి తిరిగి వచ్చింది. శశిరేఖ కిటికీలో కూర్చుని తోటలోకి చూస్తూంది

"మీ అన్నయ్య ఉత్తరం రాశారా శశిరేఖా?" హఠాత్తుగా అలసట తోచి మంచంమీదకు ఒరుగుతూ అడిగింది భారతి.

"వ్రాయడు. తనెందుకు రాస్తాడూ? వ్రాసినా చదవకుండా చింపి పారేస్తా

నని తెలుసు," అంటూనే కిటికీలోంచి దిగి, భారతి మంచం దగ్గిరకి వచ్చి పక్కమీద కూర్చుంది.

"మీ కో సంగతి చెప్పనా?" అడిగింది.

"చెప్పు," అంది భారతి నిర్లిప్తంగా.

"నిన్న అమ్మ ఉత్తరం ఎంతో సరదాగా వ్రాసింది. కొద్ది రోజుల తరువాత మనకి సెలవులు వస్తాయి కదా? అప్పుడు మిమ్మల్నికూడా తీసుకు వెడుతుందిట మా యింటికి ఓ పది రోజులు సెలవులు హాయిగా గడపవచ్చు. ఏం మిస్! మీరు తప్పకుండా వస్తారుగా?" అడిగింది శశిరేఖ.

"నన్ను అలా పిలవకు శశిరేఖా. మనిద్దరం స్నేహితులం కదా. నిన్ను నేను శశిరేఖా అని పిలుస్తుంటే నువ్వు నన్ను భారతీ అని పిలువు నీకు ఇక్కడ టీచర్ని కానుగా.'' అంది భారతి. పోనీ నిన్నూ శశిరేఖగారూ అని పిలవనా?" అడిగింది.

"అలా పిలిస్తే నా పేరు బాగుండదు," అని బుంగమూతి పెట్టింది శశిరేఖ. అంతట్లోనే ఏదో జ్ఞాపకం వచ్చినట్టు "మనం ఈ వారం సంతకి వెళ్ళడంలేదా?" అడిగింది.

"వెళ్ళ కేం - రేపు వెడతాం. ఆఫీసులో నీలవేణి లిస్టులు టైపు చేస్తూంది, చూడలేదూ?" అడిగింది భారతి.

ఓ పదిమంది విద్యార్థినులని వెంట పెట్టుకుని ఇద్దరు టీచర్లు సాధారణంగా సంతనాడు వెళ్ళి కావలసినవన్నీ తెస్తూ ఉండడం రివాజే. సరదాగా తిరుగుతూఉంటే శశిరేఖ అన్నీ మరిచిపోతుందని భారతి అభిప్రాయపడింది. అందుకే సంతకి వెళ్ళే జట్టుపిల్లలతో శశిరేఖనికూడా చేర్చింది. కొనవలసిన లిస్టులు పంచుకుని నాల్గు జట్లుగా బజారు చుట్టివచ్చి ఒక చోట కలుసుకోవడం, అక్కడినుంచి బయలుదేరి అంతా స్కూలువాన్‌లో తిరిగి రావడం పరిపాటే. నాలుగైదు వారాలుగా శశిరేఖ తన జట్టు వదిలి ఇంకో జట్టుతో బజారు తిరిగి రావడం చూస్తూనే ఉంది భారతి 'శశిరేఖ స్నేహితురాలెవరైనా ఆ గుంపులో ఉంది కాబోలు' అనుకుంది. 'ఎంతలో కొత్త స్నేహాలు కలిసిపోతాయి ఏళ్ళకి' అనుకుంది కూడా.

సంతనాడు పక్కఊరికి వెళ్ళడం అంటే ఎంత ఉత్సాహం ఏర్పడింది శశిరేఖకి. వారం పొడవునా ఆ రోజు కోసం ఎదురుచూస్తుందా అనిపించేది. సంతనుంచి వచ్చాకకూడా మరీ ఉత్సాహంగా తిరుగుతూ ఉండేది.

"నువ్వు వచ్చిన రోజున ఈ మాత్రంగా తయారు అవుతా వనుకోలేదు," అని ఎవరేనా అంటే, సిగ్గుతో శశిరేఖ చెక్కిళ్ళు ఎర్రగా అయేవి.

"నా కేం తెలుసూ? ఇక్కడో జైలులా ఉంటుంది అనుకున్నాను. హాయిగా, ఇలా స్వేచ్ఛగా ఉంటుందని తెలిస్తే ఎప్పుడో వచ్చి చేరేదాన్ని," అని సమాధానం చెప్తూన్న శశిరేఖని ఇటు భారతీ-అటు నీలవేణీ గమ్మత్తుగా చూసేవారు.

"ఎంత అమాయకురాలు!" అని భారతి చూసేది.

"ఏం పథకం వేస్తున్నావే చిట్టి తల్లీ!" అన్నట్టు నీలవేణి చూసేది.

అనుకోకుండా ఒక రోజు సాయంత్రం శశిరేఖ అన్నగారు సూర్యారావు స్కూలుకి వచ్చాడు మేడమ్, భారతికి కబురు పెట్టింది

తనకు తెలియకుండానే ఈ సూర్యారావు రాకకోసం ఎదురుచూసింది భారతి. ఆఫీసు రూములో అడుగు పెట్టగానే 'నమస్తే' అంటూ పలకరించాడు సూర్యారావు.

"నమస్తే," అంటూ ఎదుటి కుర్చీలో కూర్చుంది భారతి.

ఎందుకో చాలా బేలతనంగా అనిపించింది భారతికి

"మీ మేడమ్ ఇప్పుడే క్వార్టర్సుకి వెళ్ళిపోయారు. నాకు కావలసినవి మీతో మాట్లాడమన్నారు,'' అన్నాడు సూర్యారావు,

తలెత్తి సూర్యారావుకేసి చూసింది భారతి. గమ్మత్తుగా మెరుస్తున్న కళ్ళతో చూస్తూఉన్నాడు. ఆ క్షణంలో అతనికి శశిరేఖకి తేడా లేనట్టు అనిపించింది భారతికి. "నా కేమైంది? ఈ వ్యక్తి న న్నెందుకింత కదిలించాలి?'' అని వింతపడింది భారతి.


"ఇప్పుడు చెప్పండి. మా శశి ఎలా వుంది?" కుర్చీలో జేరబడి కూర్చుంటూ అడిగాడు సూర్యారావు.

"బాగుంది. చాలా సరదాగా వుంది. శశిరేఖలో వచ్చిన మార్పు చూస్తే మీకే ఆశ్చర్యం వేస్తుంది," అంది ఉత్సాహంగా భారతి.

"అదంతా మీ చలవే. మా అమ్మగారు మేం తిరిగివెళ్ళినరోజే అన్నారు. 'మీతో వుంటే శశి తప్పక మారుతుం' దని తోచిందట ఆవిడకి;" సన్నగా వేళాకోళం ధ్వనిస్తూ అన్న సూర్యారావుకేసి రెప్ప వాల్చక చూసింది భారతి

"ఐతే ఆ నమ్మకం మీకు లేదా?"

"ఆ రోజు మిమ్మల్ని చూడగానే అనిపించింది. ఇంత నాజూకుగా, నెమ్మదిగా ఉండే మీరు మా శశి లాంటి మొండిని ఎలా భరించకలరని. కాని తరువాత నా అభిప్రాయం మార్చుకున్నాను. అమ్మకి శశి రాసిన ఉత్త




రాలు చూస్తే మీకే తెలిసేది!'' అన్నాడు

"శశిరేఖ క్లాసులో ఉండిఉంటుంది. పిలిపించమంటారా?" ఇంకేం మాట్లా డాలో తెలియక అడిగింది భారతి.

"అక్కర్లేదు. కాస్సేపు వుండి పిలుద్దురుగాని. మీరు మా వూరి మేష్టా రమ్మాయి కదా! నాకెందుకు చెప్ప లేదు?" అడిగాడు సూర్యారావు.

"నిజమే. కాని చెప్పవలసిన అవ సరం లేదుకదా?" అంది భారతి.

"ఆ సంగతి అప్పుడే తెలిస్తే అమ్మ గారు ఇంకా ధైర్యంగా ఉండేవారు కదా? సరే, మీరు పట్నంలో నన్ను ఎప్పుడేనా చూశారా?'' అడిగాడు.

కాలేజీలో చదువుకునే రోజుల్లో పిల్లజమీందారుని చూసి అమ్మాయిలు అనుకునే మాటలన్నీ జ్ఞాపకం వచ్చి, సిగ్గుతో ముఖం ఎర్రబడింది భారతికి.

"నేనూ పట్నంలో చదువు కున్నాను," అంది సమాధానంగా.

"పోనీ ఆ సంగతి చెప్పి వుండ వచ్చుగా. మీకూ మా శశిరేఖకిలాగా నన్నుచూస్తే భయమా? అసహ్యమా?" నవ్వుతూ అడిగాడు సూర్యారావు

ఆ మాటకి భారతికూడా నవ్వే సింది, "భలేవారే. అవన్నీ చెప్పవలసిన సందర్భం రాలేదు. అంతకుమించి వేరేం లేదు," అంది.

"పోనీలెండి. ఆ మాత్రం దయ చూపారు," అన్నాడు నెమ్మదిగా.

అతని కంఠస్వరంలో వచ్చిన మార్పుకి ఆశ్చర్యపడింది భారతి.

"మిమ్మల్ని ఆరోజు చూసినదగ్గర నుంచీ నాలో కొత్త ఆలోచనలు బయలుదేరాయి. పోనీలెండి, ఇప్పుడా గొడవ ఎందుకుగాని, వచ్చేవారం స్కూలు మూస్తారుగా శశిరేఖతో పాటు మీరు మా యింటికి రావాలని అమ్మగారు చెప్పమన్నారు. అందుకే నేను బయలుదేరి వచ్చాను," అన్నాడు.

"నేను సాధారణంగా సెలవులు ఇక్కడే గడిపేస్తాను," అంది భారతి నెమ్మదిగా 'అవును; నా కెవరూ లేరు' అన్న నిస్సహాయత ధ్వనించిందా మాటలో.

"మీ రలా ఎందు కనుకుంటారు? మీరు మా ఆతిథ్యం కాదనరు కదూ?" 'ప్లీజ్ ప్రామిస్' అన్నట్లు అడిగాడు సూర్యారావు.

"నేను ప్రిన్సిపాల్‌ని అడిగిగాని చెప్పలేను," అంది భారతి.

"మీ తరఫున నేను అడిగాను. మీకూ ఈ మార్పు బాగుంటుందన్నారామె మీరు కాదనకండి నాన్నగారు పోయాక మా యింట మనశ్శాంతి లేకుండా చేసింది శశిరేఖ. ఇప్పుడిప్పుడే నెమ్మది లభ్యమవుతూంది మాకు. దీని కంతకూ మీరే కారణం అని అమ్మకూ నాకూకూడా తెలుసు,"

అని లేచి నిలబడ్డాడు సూర్యారావు భారతి కూడా నిలబడింది మనిషి అక్కడున్నా మనసు ఏమిటో, ఆలోచిస్తూంది

"నా కో సంగతి ఇప్పుడే ఇక్కడే చెప్పాలని ఉంది కాని మీరు మా యింటికి వచ్చేదాకా ఆగుతాను," దగ్గిరగా వస్తూ అన్నాడు సూర్యారావు

దగ్గిరగా వస్తూ అన్న సూర్యారావు మాటలు రహస్యంగా చెవిలో చెప్పినట్టు అనిపించింది భారతికి

"నేను వెళ్లి శశిరేఖని పంపుతాను," అంది తొట్రుపాటు కప్పిపుచ్చుకుంటూ.

నవ్వుతూ అవతలి వరండావైపు చేయి చూపాడు సూర్యారావు

"మీ కా శ్రమ అక్కరలేదు అదిగో శశి అక్కడ స్తంభానికి ఆనుకునిఉంది," అన్నాడు.

"మీ రేదో చాలా సీరియస్‌గా మాట్లాడుతున్నారు – రెండోచెవికి వినబడకుండా! అందుకే ఇక్కడే నిలబడ్డాను," అంది శశిరేఖ.

భారతి సిగ్గుతో తల వంచింది.

"ఏం లేదు శశీ మీ మిస్‌ని మన యింటికి ఆహ్వానించమంటేనూ, అడగడానికి వచ్చాను,'' అని వివరించాడు సూర్యారావు.

అన్నగారి ముఖంలోకి ఓ క్షణం

చూసి ఊరుకుంది శశిరేఖ. "అలాగే వస్తాం-ఓ వారంరోజులే కదా. ఇక మేం వెళ్ళనా?'' తన తత్తరపాటు నుంచి తేరుకుని అంది భారతి.

కొద్దిసేపట్లోనే కాంపౌండులో కారు స్టార్టు అయిన చప్పుడు విని పించింది. అప్పటిదాకా మౌనంగా ఉన్న శశిరేఖ, భారతికేసి వింతగా చూసి అమాంతం కౌగలించుకుంది. "నువ్వు నా సమస్యలన్నీ పరిష్క రిస్తావు భారతీ! నాకు తెలుసు,'' అంది.

'ఎలాగ?' అని అడగలేదు భారతి.

## 5

తనపై తనకి నమ్మకం తగ్గిపో యింది భారతికి. తనకీ శశిరేఖకీ తేడా ఏమిటి? తను మటుకు కూడని పని చేయడం లేదా? సూర్యారావు జమీం దారు. తను-అందని మ్రానుకి నిచ్చెన వేస్తూంది. కాని హృదయం చెప్పిన మాట వినదు. ఏ పని చేస్తున్నా సూర్యా రావు కళ్లు, సూర్యారావు కంఠస్వరం ఆమెని వెన్నాడుతున్నాయి. తీయని బాధతోపాటు దుఃఖంకూడా గూడు కట్టుకుంటూంది భారతి హృదయంలో.

ఎన్నడూ లేనిది స్కూలు మూసే రోజు ఎప్పుడు వస్తుందా? అని ఎదురు చూసింది భారతి. "ఏమిటీ! నాకంటె నువ్వే ఎక్కువ ఆత్ర పడుతున్నావు మా ఇంటికి వెళ్ళడానికి?" అంటూ శశిరేఖ వేళాకోళాలు చేయడంకూడా ప్రారంభించింది.

అనుకున్నరోజు రానే వచ్చింది. తీరా సెలవులు ఇచ్చాక, పిరికితనం వచ్చింది భారతికి.

ఆ రోజు ఉదయమే కారు తీసుకుని వచ్చాడు సూర్యారావు. చిన్నపెట్టె సర్దుకుంది భారతి. ప్రిన్సిపాల్‌కి చెప్పి బయలుదేరింది.

శశిరేఖా భారతీ వెనుకసీటులో కూర్చున్నారు. సూర్యారావు కారు డ్రైవు చేస్తున్నాడు. కొద్ది దూరం కూడా సాగకముందే-

"నువ్వు ముందుకి వెళ్ళి కూర్చో. నేను వెనుకసీటులో హాయిగా పడు కుంటాను,'' అని సణగడం ప్రారం భించిందింది శశిరేఖ.

"ఓ, అరవై మైళ్ళకే! ఇంతట్లోనే పడుకోవాలా ఏం?" అంది భారతి.

రోడ్డువారగా కారు ఆపేడు సూర్యారావు.

తలుపు తెరచి పట్టుకుంటూ "మీరు వచ్చి ముందు కూర్చోండి. లేకుంటే శశి అలా సణపెడుతూనే ఉంటుంది," అన్నాడు. "అదెంత మొండిదో తెలిసిన విషయమేగా," అన్నాడు నవ్వుతూ.

చేసేది లేక ముందుసీటుకి మారింది భారతి.

'అమ్మయ్య' అని వెనుకసీటులో పడుకుంది శశిరేఖ.

గతుకుల రోడ్డుమీద నెమ్మదిగా సాగుతూంది కారు. అటూ ఇటూ చూడకుండా తిన్నగా చూస్తున్న భారతిని తన కొనకంట చూసి నవ్వు కున్నాడు సూర్యారావు.

"చదువుకున్నారన్న మాటేగాని మీకు కబుర్లు చెప్పడమే రాదు!" అన్నాడు వేళాకోళంగా.

"పచ్చని చేలూ, చెట్లూ చూస్తు న్నాను" అంది భారతి.

"ఇంకో నలభై మైళ్లు ఈ కఠిన శిక్ష మీకు. తరువాత హాయిగా నన్ను తప్పించుకుని తిరుగుదురు గాని," అన్నాడు సూర్యారావు.

విశాలమైన తన కళ్ళను విప్పార్చి చూసింది భారతి చిలిపిగా ఒక కన్ను మూస్తూ రోడ్డువైపు దృష్టి మళ్ళిం చాడు సూర్యారావు

అందరూ చెప్పుకోగా వినడమే గాని జమీందారుగారి ఇల్లు ఎప్పుడూ చూడలేదు భారతి. గేటు దాటి, కారు లోపల ప్రవేశించాక, సువిశాలమైన తోట దాటి, ఇంటిముందు మెట్లదగ్గిర ఆగింది. సూర్యారావు కారాపి, తను ముందు దిగి, భారతివైపు తలుపు తెరి చాడు. ఈలోగానే శశిరేఖ దిగేసింది. కూతురి రాకకోసం మెట్లపైన నిలబడి ఆత్రంగా ఎదురుచూస్తున్నారు జమీం దారిణి. వారికి నమస్కరించింది భారతి. వెళ్ళి తల్లిని గట్టిగా కౌగలించు కొంది శశిరేఖ. పనివాడికి చెప్పి పెట్టెలు లోపల పెట్టిస్తున్నాడు సూర్యారావు...

దిగినది మొదలుకొని క్షణం తెరిపి లేకుండా వసపిట్టలాగా వాగుతూంది శశిరేఖ. కూతురు అంత సంతోషంగా, ఆనందంగా ఉండడం చూస్తున్నకొద్దీ జమీందారిణికి భారతిమీద అభిమానం పెరుగుతూంది

## 6

ఒకనాటి మునిమాపువేళ భారతిని తోటలో కూర్చోపెట్టుకుని విశేషాలు అడగడం ప్రారంభించారు జమీందారిణి

"మీకింకా చెప్పతగ్గవేం వుంటాయి? మీ అమ్మాయి రోజుకో ఉత్తరం వ్రాసేదిగా!" నవ్వుతూ అంది భారతి.

"వారానికో పంక్తి రాస్తేగొప్ప-అదేనా అంతా నీ గురించే. పెద్ద ఉత్తరం ఎక్కడ రాసింది?" అన్నా రామె.

"అదేమిటి? రోజుకో ఉత్తరం పడేస్తుందని నీలవేణి చెప్పిందే. నేను శశిని అడిగితే 'అవును అమ్మకే!' అంది. మరి ఆ ఉత్తరాలన్నీ మీకు కాదా?" బిత్తరపోతూ అడిగింది భారతి.

(సశేషం)




(మే సంచిక తరువాయి)

"లేదు, లేదు. అన్ని రాయనేలేదు. నా బిడ్డ పూర్తిగా మారిపోయింది కదూ?" ఆర్ద్రంగా ఉన్న స్వరంలో అడిగారు.

"అవునండీ, శశిరేఖ బాగా మారింది. ఇంక మీరు బెంగ పెట్టుకోనక్కరలేదు," అంది ధీమాగా భారతి. 'నిజమే శశిరేఖ ఒక్కరోజు కూడా తను ప్రేమించిన మోహన్ గురించి మాట్లాడలేదు. ఇక లాభం లేదని వదులుకున్నట్టుంది' అనుకుంది భారతి.

"నీకా మోహన్‌ని గురించి చెప్పలేదా శశిరేఖ?" అడిగారు జమీందారిణి.

"తొలిరోజుల్లో ఒకటి రెండుసార్లు చెప్పింది. 'అందంగా ఉంటాడు. డబ్బు లేకపోతేనేం మాకున్నది చాలదా?' అంది. 'మరీ మూర్ఖపు పట్టుదలలు' అనేది నే చెప్పి చూశాను. మళ్ళీ నా దగ్గిర ఆ ప్రస్తావన తేలేదు." అంది భారతి.

"నిజంగా ఆ మోహన్ ఈ ఇంటికి శనిలాగా దాపురించాడమ్మా. ఏనాడు చేసిన పాపమో, అతని రూపాన పట్టి

పీడిస్తాం దీనాడు మమ్మల్ని. శశిరేఖ స్కూలుకి వెళ్ళిపోయాక ఒకటి రెండు సార్లు ఈ చుట్టుపక్కల తారసపడ్డాడట అబ్బాయికి అబ్బాయిదిమరీ ముక్కోపం. మళ్ళీ తన కంటపడితే తంతానని బెద రించాడుట. మోహన్ పగపట్టిన తాచులాంటివా డమ్మాయీ...వాణ్ణి గురించి శశిరేఖకి ఏమీ తెలియదు," అన్నా రామె నిస్పృహతో.

"మీ రెందుకు చెప్పి చూడలేదు? అంత కానివాణ్ణి చేసుకుంటా నంటుందా?" అంది భారతి.

"అక్కడే జరిగింది పొరపాటు. మేం వాడి చెడు గురించి చెప్పినకొద్దీ వా డంటే కక్ష ఉంటుంచేత అలా అంటున్నా మని నిశ్చయించుకుంది."

"పోనీలెండి, ఇక ఆ బెంగ లేదుగా. శశిరేఖ కో మంచి సంబంధం చూసి చేద్దురుగాని." ఓదార్పుగా అంది భారతి.

"అంతా భగవంతుడి దయ తల్లీ! అదుగో సూర్యంకూడా వస్తున్న ట్టుంది,'' అంటూ లేచా రామె.

భారతి కూడా లేచింది.

"నువ్వు కాస్సేపు కూర్చో అమ్మాయీ! నేను మళ్ళీ వస్తాను," అంటూ ఆమె లోపలికి వెళ్ళిపోయారు.

మళ్ళీ వస్తా నన్నారు కదా అని అక్కడే కూర్చుంది భారతి. దూరం నుంచే తల్లినీ భారతినీ చూసిన సూర్యా రావు అటే వచ్చాడు. ఇంతట్లోనే అమ్మగారు లోపలికి వెళ్ళడం, భారతి ఒంటరిగా తారసపడ్డం ఉత్సాహం కల్గించింది అతనికి.

"ఏమిటి చాలా సుదీర్ఘంగా ఆలో చిస్తున్నట్టున్నారే." తల వంచుకుని కూర్చున్న భారతిని వస్తూనే అడిగాడు. ఎలా సంభాషణ మొదలు పెట్టాలో తెలియలేదు భారతికి.

"ఏం లేదు మీ మదర్ లోపలికి వెళ్ళారు మళ్లా వస్తామన్నా," రంది.

"అందుకని వేచి చూస్తున్నారా?" అంటూ నవ్వుతూ పక్కనే కూర్చు న్నాడు సూర్యారావు.

"మీతో ఒక్క విషయం చెప్పాలి," అంది భారతి.

"నేనూ చెప్పాలి. అందుకే మీ కోసం వచ్చాను," అన్నాడు.

"శశిరేఖ దరిదాపు రోజూ ఒక ఉత్తరం రాసేది. మీ అమ్మగా రేమో 'అబ్బే, వారాని కొకటి రాస్తేనే అబ్బురం' అన్నారు. ఆ ఉత్తరా లెవరికి రాసిం దంటారు?" అడిగింది. భారతికి ఒక విధంగా భయం పట్టుకుంది. అందరినీ నమ్మించి మోసం చేయదు కదా శశిరేఖ? అనుకుంది. ఈయన నాపైన అంత నమ్మకం ఉంచారే! శశి ఏదైనా తప్పుదారి తొక్కితే తా నెంత తప్పు అంచనా వేసుకున్నానో అనుకుంటారు ఎలాగ? అనుకుంది.

ఏదైనా జరిగితే ప్రిన్సిపాల్ కి ముఖం ఎలాగ చూపడం? అనుకుంది

అప్పటిదాకా నవ్వుతో వెలుగుతున్న సూర్యారావు ముఖం గంభీర మైంది.

"మీ రంటున్న దేమిటి? శశి ఎవరి కేనా ఉత్తరాలు రాస్తూందేమో ఎప్పుడూ అడగలేదా?"

"అమ్మకి అని క్లుప్తంగా బదులు చెప్పేది. మీకు దగ్గర చుట్టాలు గాని, బంధువులుగాని ఎవరేనా ఉన్నారా? బహుశా శశిరేఖ వారి కెవరికేనా రాస్తూ ఉండివుండొచ్చు కదా!" అడిగింది.

అలా ఎప్పుడూ రాసేది కాదు. ఇంటి దగ్గిర ఉన్నప్పుడు లేని బంధువులు అక్కడి కెలా వస్తారు?" ఓ క్షణం ఆగాడు సూర్యారావు.

"మీ కా మోహన్ సంగతి తెలియదు. ఎంతకైనా తెగించినవాడు. కటిక కసాయివాడు కూడా. ఎక్కడైనా దయాదాక్షిణ్యాలు చూపుతాడేమో గాని మోహన్ కి అలాంటి వాటికి అర్థంకూడా తెలియదు. నాతో ఛాలెంజి చేశాడు భారతీ వాడు. వాడు గుండెలుదీసినబంటు!" ఆవేశంతో అరచినట్టుగా అన్నాడు సూర్యారావు

"మన పిల్లని కట్టుదిట్టం చేసుకోవాలి మనం. ఊళ్ళోవా డెవడో ఏదో అన్నాడని మనం ఏం చెయ్యగలం?" నెమ్మదిగా అంది భారతి.

సూర్యారావు కళ్ళలో బాధ స్పష్టంగా కనబడుతూంది. బోనులో పెట్టిన పులిలాగా ఇటూఅటూ పచార్లు చెయ్యడం మొదలుపెట్టాడు.

"మీరు అనవసరంగా గాబరాపడుతున్నారేమో! శశిరేఖకి ఇప్పుడా మొంకిపట్టుదల లేదేమో!" అంది అనుమానంగానే.

"అలా అయితే బాధేలేదు. కాని, సరే. ఇక మనం చేయగల్గిన దేముంది కనుక?" అంటూ మళ్ళీ వచ్చి భారతి పక్కనే కూర్చున్నాడు సూర్యారావు.

ఆందోళనతో కూడిన అతని ముఖం చూస్తే జాలివేసింది భారతికి. ధోరణి మార్చాలన్న తలపుతో "ఇందాక ఏదో అడగాలి అన్నారే," అడిగింది.

ఆ క్షణంలో ప్రసన్నం అయింది సూర్యారావు ముఖం.

భారతి చేయి అప్యాయంగా తన రెండు చేతులలోకి తీసుకున్నాడు. తెల్లపావురపు పిల్లలాగా ముడుచుకుని ఉన్న ఆమె చేయి అతని చేతులమధ్య నిస్సహాయంగా ఉన్నట్టు అనిపించింది.

"చూడు భారతీ! ఇదివరలో ప్రేమా, పెళ్ళీ అంటే నేను ఎప్పుడూ లెక్కచెయ్యలేదు. కాని నా ఊహలనీ, ప్రపంచాన్నీ నువ్వు తలకిందులు చేశావు భారతీ! ని న్నా స్కూల్లో చూసినది మొదలు నేను ఎప్పుడు తలెత్తి చూసినా, నువ్వే కనపడితే



బాగుండును అనిపిస్తోంది. నేనేదైనా నిర్ణయించుకుంటే దాన్ని దాచుకోలేను; అమ్మగారితో చెప్పాను. తనకేం అభ్యంతరం లేదన్నారు. ఎల్లుండి మన శశిరేఖ పుట్టిన రోజు. ఆ రోజే మన పెళ్ళి నిశ్చయంకూడా. చుట్టాలకీ స్నేహితులకీ తెలియచేయాలని నా అభిలాష. నీకేం అభ్యంతరం లేదుగా ?"

'ప్రేమతో నిండిన కంఠస్వరంతో మాట్లాడుతూ ఉంటే సూర్యారావు ఎంత బాగుంటాడు !' అనుకుంది భారతి. 'నేనెవ్వరి నడగాలి? నాకెవరున్నారు అభ్యంతరాలు చెప్పడానికి?' అన్నది గుర్తుకు రాగానే దుఃఖం పొంగివచ్చింది.

"ఎందుకలా కంట తడిపెడతావు భారతీ! నీకు ఇష్టం లేకుంటే నిరభ్యంతరంగా చెప్తావనే కదా!" భారతిని ఆప్యాయంగా తన చేతుల్లోకి తీసుకుని గుండెల కదుముకుంటూ అడిగాడు సూర్యారావు.

"లేదు లేదు; ఇష్టం లేదని కాదు. నా కెవ రున్నారని అడగడానికి? నాలో ఏముందని మీ కింత ప్రేమ? ఆప్యాయత నెరుగని నాకు మీ రింత ఆప్యాయత కనబరచేసరికి దుఃఖం వచ్చింది," అంది భారతి అతని గుండెలలో ముఖం దాచుకుంటూ.

అప్పుడే తోటలోకి వచ్చిన శశిరేఖ ఈ దృశ్యం చూసి మరీ ఆశ్చర్యపడ లేదు. "హాయి! హాయి! మీ ప్రేమ మంచి రసవత్తరఘట్టంలో పడిందే!" అంది అక్కడే కూర్చుంటూ.

అదరిపడి దూరంగా జరిగింది భారతి.

తప్పు చేసినవాడిలాగా తలమీద చేయి వేసి జుట్టు సవిరించుకుంటూ ఎక్కడో చూడ్డం ప్రారంభించాడు సూర్యారావు.

"నేను మళ్ళీ వస్తాను. స్నేహితు రాళ్ళు మాట్లాడుకోండి," అంటూ గబగబా అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

నవ్వుతూ భారతి ముఖం తనవైపు తిప్పుకుంది శశిరేఖ.

"పెద్దవాళ్ళను కాదనను, తప్పు,'' అంటూ పాతమాటలు గుర్తు చేసింది.

"నువ్వేదో ఊహించుకుంటు న్నావు శశిరేఖా! మీ అన్నయ్య నన్ను పెళ్ళి చేసుకుంటానని అడిగారు." తన పొజిషన్ వివరించాలని చెప్పింది భారతి.

"తమదాకా వస్తేగాని ఇలాంటివి అనుభవానికి రావు కదా!" అంది శశిరేఖ. "లే, లోపలికి పోదాం-చీకటి పడిపోయింది," అంటూ భారతిని లేవ దీసింది. "నీతో ఈ రెండు రోజుల్లో ఎన్నో చెప్పాలని అనుకున్నాను. నీతో నా కేదైనా చెప్పే ధైర్యం ఉంది. కాని ఇప్పుడు కాదనిపిస్తూంది భారతీ! ఎప్పుడైనా నేనేదైనా తప్పటడుగు వేస్తే నువ్వు అర్థం చేసుకుంటావు. ఆ ధైర్యం ఈ రోజు వచ్చింది నాకు. ఇదివరలో నువ్వు వట్టి 'మిస్'వే! కాని ఇప్పుడో స్త్రీవి!'' అంది శశిరేఖ.

భారతికి ఏం చెప్పాలో తోచలేదు.

నేలమీద కాళ్ళూ, మబ్బుల్లో ఊహలూ ఉన్నాయి.

## 7

రాత్రి విందుభోజనాలు- ఇల్లంతా ఒకటే హడావిడిగా ఉంది. అందమైన దీపగుచ్ఛాలు శుభ్రంగా తుడవడంతో వింతరంగులు వెదజల్లుతున్నాయి. గాలికి కదలాడుతున్న వాటి చప్పుడు మృదువైన సంగీతం లాగా ఉంది. హాలులో గోడలకి ఉన్న పాతకాలపు తైలవర్ణ చిత్రాలు తుడిపించింది భారతి. బంగారం రంగులో ఉన్న వాటి ఫ్రేములు దీపకాంతికి తళతళ మెరిసేలాగా ఉన్నాయి. ఖరీదైన తివాసీలు దుమ్ముదులిపి తిరిగి పరిచారు.

కుర్చీలు అమర్చారు. ఇల్లంతా కొత్త వెల్గుతో నిండినట్లుంది.

సాయంత్రం అయిదు గంటల వేళ భారతి ఒక్కర్తీ బయలుదేరింది దేవాలయానికి. పుట్టి పెరిగిన ఊరు— ఎన్నాళ్ళయిందో గుడికి వెళ్ళి! చిన్న తనంలో సరదాగా గుడి ఆవరణలో ఆడుకొనేది. ఒకర్తే నడిచి వెడుతూ ఉంటే చిన్ననాటి సంగతులన్నీ జ్ఞాపకం వస్తున్నాయి. చేతిలో పూలూ, కొబ్బరి కాయా మొదలైన పూజాద్రవ్యాలు ఉన్నాయి. ఊహలు మటుకు రెక్కలు విచ్చుకొని గతంలో విహరిస్తున్నాయి. అలా ఆలోచనలు వెంట తరుము తూండగానే దేవాలయంలో ప్రవే శించింది గుడిలో ఎక్కువ జనంకూడా లేరు. త్వరగా పూజ చేయించి బయ టికి వచ్చింది. నాలుగడుగులు వేసిందో లేదో ఎదురుగా నిలబడిన వ్యక్తిని చూసి నిశ్చేష్టిత అయి నిలబడిపో యింది. నోట మాట రాలేదు.

"మీరు...నువ్వు..." తడబడింది భారతి.

"ఔను నేనే. ఆ రోజు ఉత్తరం ఇచ్చి పుణ్యం కట్టుకున్నారు ఈ రో జేమిటి? మీ రనాలా? ను వ్వనాలా? అని ఆలోచిస్తున్నారు?" హేళనగా అంటున్న అతని కళ్ళు తళతళ మెరుస్తున్నాయి,

"మీ రిక్క డెందు కున్నారు? సూర్యానికి తెలిస్తే!" అంది.

"మీరు చెప్తే తప్పించి ఎందుకు తెలుస్తుంది? మీరు చెప్పరు," అన్నాడు ధీమాగా.

భారతికి కొంచెం ధైర్యం వచ్చింది. ఇతని సంగ తేమిటో తెలుసుకోవా లనుకుంది.

"మీ రిక్క డున్నసంగతి ఎవరికేనా తెలుసా?"

"ఒక్క శశిరేఖకి తెలుసు ఇంత వరకూ. ఇప్పుడు మీకు తెలిసింది. అయినా మీరు తటస్థపడతా రనుకో లేదు నేను," అన్నాడు మోహన్.

"శశిరేఖ కెలా తెలిసింది? మిమ్మల్ని పూర్తిగా మరిచిపోయింది శశిరేఖ. ఇక ఆ కుటుంబాన్ని వేధించకండి;" అవే శంగా అంది భారతి.

శశిరేఖ నన్ను మరిచిపోయిందా?" హేళనగా నవ్వాడు మోహన్. "న న్నెలా మరిచిపోతుంది? రోజూ ఒక ఉత్తరం రాసేది. మరిచిపోతే రాసేదా?" అడిగాడు.

"మీకా రాసింది?" అదరిపడింది— భారతి.

ఒక్షణంలో తెప్పరిల్లింది.

"స్కూలుకి ఉత్తరాలు రాకూడదే. మీ ఉత్తరా లెలా వచ్చాయి. మీరు అబద్ధం ఆడుతున్నారు," అంది.

సమాధానంగా నవ్వాడు మోహన్.

"చెప్పండి మీది అబద్ధమేనా?"

"మీతో సంతకివచ్చేటప్పుడు అవూరు

పోస్టాఫీసులోంచి నా ఉత్తరాలన్నీ తీసుకునేది," అన్నాడు.

తన తెలివితేటలకి తనని తనే అభినందించుకున్నట్టు టోపీ సవరించుకున్నాడు

ఎంత ఆశ్చర్యం ? ఇందుకా శశిరేఖ అంత ఆనందంగా ఉంది ? 'ఈ సంగతి సూర్యానికి తక్షణం తెలియాలి' అనుకుంది భారతి.

"మీ రిక వెళ్ళండి. ఇక ఈ ఊళ్ళో ఉంటే మీకు మర్యాద దక్కదు," అంటూ కోపంగా ముందుకి సాగింది.

ఆమెను కొంతదూరం వెళ్ళనిచ్చి, "ఇన్నాళ్ళు ఓపిక పట్టారు; ఈ ఒక్క రాత్రికి ఓపికపట్టండి. అంటూ కేక వేసి త్వరత్వరగా అడుగులు వేసుకుంటూ సాగిపోయాడు మోహన్.

భారతి నడకవేగం హెచ్చింది.

మోహన్ శశిరేఖ కలిసి తనని ఎంత మోసం చేశారు ? ఈసంగతి జ్ఞాపకం వస్తూంటే నడక మరీ వేగం కాసాగింది. గుండె దడదడ లాడుతున్నా ధైర్యం చెప్పుకుంటూ ఇల్లు చేరింది భారతి.

లోపలికి వెడుతూనే సూర్యారావు కోసం వెదికింది. అతను ఇంట్లో లేడు.

"విందువేళలోగా వచ్చేస్తా నన్నాడమ్మా," అన్నారు శశిరేఖతల్లి.

కూనిరాగాలు తీస్తూ శశిరేఖ స్నానం చేస్తూంది.


ఇక చేసే దేంలేక భారతి, తనూ అతిధులు వచ్చేవేళకు సిద్ధం కావాలని తయారుకావడం ప్రారంభించింది. ఏపని చేస్తూన్నా మోహన్ మాటలు జ్ఞాపకం వస్తున్నాయి. సూర్యం ఇంటికి ఎప్పుడు వస్తాడా అని ఎదురుచూడ సాగింది

ఈగొడవేం లేకుండా చక్కగా అలంకరించుకొని బంగారు బొమ్మలాగా తయారైంది శశిరేఖ. పాతకాలపు జహ్వారీతో దివినుండి దిగివచ్చిన దేవ కన్యకలాగా ఉంది శశిరేఖ.

భారతి మనస్సు పరిపరి విధాల పోతూంది ఏపనీ పూర్తిగా చేయిలేక పోతూంది. బాగా చీకటులు అలము కొన్నాయి. భవంతి ముందుహాల్లో దీపాలు దేదీప్యమానంగా వెల్గి పోతున్నాయి. ఊరి పెద్దలంతా ఒక్కొక్కరే వస్తున్నారు. వారితోపాటే లోపలికి అడుగు పెడుతున్న సూర్యాన్ని చూడగానే ప్రాణం లేచి వచ్చింది భారతికి కాని అతడు మాత్రం ఎంతసేపటికీ లోపలికి రాలేదు. అందరితో నవ్వుతూ కబుర్లు చెప్తున్నాడు. పెద్దలతోపాటే ముందు హాల్లోనే కూర్చుండిపోయాడు.

అతనేంత ఆలస్యం చేస్తే అంత ప్రమాదం అని బెంగపడుతూంది భారతి.

భారతి అదోలా ఉండడం గమనించింది శశిరేఖ.




"ఏం భారతీ! ఎందు కంత హడా విడిగా అన్నయ్య కోసం చూస్తున్నావు. పిలవనా?" చిన్న వేళాకోళం చేస్తూ అడిగింది శశిరేఖ.

"ప్లీజ్! శశీ! అన్నయ్య నొకసారి లోపలికి పిలుస్తావా? మాట్లాడాలి," అంది ఆత్రంగా భారతి.

"ఏంకథ? నాతో చెప్పకూడదా?" అంది శశిరేఖ.

ఎంత నటించకల దీ శశి? ఏమీ తెలియనట్టే ఎలా ఉండ కల్గుతూంది? తనకి తెలిసినసంగతి చెప్తే ఏం చేస్తుంది?... 'ఉహు, చెప్పకూడదు. తొలిసారి చేసిన తప్పు చాలు,' అనుకుంది భారతి.

"ఏం లేదు. అన్నయ్యకి చెప్పాలి," అంది మొండిగా భారతి. శశిరేఖ అన్నయ్యని పిలవడానికి వెళ్ళింది. హాల్లోకి తొంగిచూసింది అందరిమధ్యా చందమామలాగా కూర్చుని కబుర్లు చెప్తున్నాడు సూర్యారావు, 'అన్నయ్యా!' అని శశిరేఖ కేక వేసింది.

లేచి ఇవతలికి వచ్చాడు సూర్యారావు. "ఏం శశీ?" అడిగాడు ఇంట్లో కళకళ లాడుతూ తిరుగుతున్న శశిరేఖని చూస్తే ఆనందంగా ఉంది సూర్యానికి. చెల్లెలి తల ప్రేమతో నిమురుతూ "ఎందుకూ పిలిచావు!" అడిగాడు

"నీతో అర్జెంటుగా మాట్లాడాలని భారతి పిలుస్తూంది," అంది. చిలిపిగా

నవ్వుతూ అన్నగారి ముఖంలోకి చూసింది.

"నీ పుట్టిన రోజు కదా? ఏం కావాలో కోరుకో ఇచ్చేస్తాను," అన్నాడు ప్రేమగా.

అప్రయత్నంగా కళ్ళవెంట నీరు వచ్చింది శశిరేఖకి.

"నే నెక్కడున్నా సుఖంగా ఉండాలని దీవించన్నయ్యా!" అంది.

"ఓయ్ పిచ్చి! ఈరోజేమైనా నీ పెళ్ళి అనుకుంటున్నావా!" అంటూనే లోపలికి వెళ్ళిపోయాడు సూర్యారావు.

అతని రాకకోసం ఆత్రుతతో వేయి కళ్ళతో చూస్తున్న భారతికి అతణ్ణి చూడగానే భోరున ఏడవాలని పించింది.

తనకోసం ఎదురు చూస్తున్న భారతిని అప్యాయంగా పొదివిపట్టుకున్నాడు సూర్యారావు

"నువ్విఊరు వచ్చినరోజునే నీకోసం ఆర్డరిచ్చాను - ఓ ఉంగరం. అదీ రోజున నీకు పెట్టాలని నా కోరిక. అందుకే వెళ్ళాను. ఏదో మాట్లాడాలన్నావుట," నెమ్మదిగా అడిగాడు సూర్యం.

"మరేంలేదు... మనశశిలేదూ..." అనబోయింది భారతి. ఇంకా మాట పూర్తి కాలేదు. జమీందారిణి లోపలకి వస్తూనే...

"అంతా నీకోసం చూస్తూంటే ను వ్విక్కడేం చేస్తున్నావు? రా నాయినా," అని సూర్యారావుని పిలిచేశారు.

భారతికేసి ప్రేమ నిండిన కళ్ళతో చూస్తూ "నువ్వూ, శశీ కూడ త్వరగా రండి," అంటూ వెళ్ళిపోయాడు సూర్యారావు.

చెప్పడానికేం అవకాశం రాక పోవడంతో మరీ బెంగపడింది భారతి. శశిరేఖని ఓ క్షణంకూడా వంటరిగా విడిచిపెట్టకూడదని నిర్ణయించుకుంది. ఈ నిశ్చయానికి వచ్చాక కొంచెం మనస్సు స్థిమితపడింది భారతికి.

హాలంతా స్త్రీ పురుషులతో నిండి ఉంది. అందరూ కోలాహలంగా కబుర్లు చెప్పుకుంటున్నారు. విందుభోజనాలు అయ్యాయి. కొడుకుపెళ్ళి నిశ్చయం అయిన శుభవార్త అందరికీ తెలియచేశారు జమీందారిణి. ఆమెకు భారతిని చూస్తే ఎంతో గర్వంగా ఉంది.

కాని భారతి మనస్సు అక్కడలేదు. శశి నెలా కాపాట్టం? అసలు శశిరేఖ వేస్తున్నది ఏమైనా ప్లానా? లేక ఉట్టినే భయపెట్టడానికి అలా అన్నాడా మోహన్? అన్న ప్రశ్నలు శాంతి లేకుండా చేస్తున్నాయి భారతిని.

భారతి ఎందుకలా ముభావంగా వుందో ఊహించలేక పోయాడు సూర్యం. అందుకే ఏకాంతంగా మాటలాడే అవకాశంకోసం చూస్తున్నాడు.



ఆడవాళ్ళమధ్య కూర్చుని క్లుప్తంగా సమాధానాలు చెప్తూంది భారతి. ఎప్పుడు లేచిందో ఎవరూ చూడలేదు. కాని శశిరేఖ అక్కడ లేదు. ఎంత సేపైౖ లేదో కూడా గ్రహించలేకపోయింది భారతి. ఒక్క ఉదుటున లేచి "శశిరేఖ ఏది?" అంటూనే లోపలికి నడిచింది. "శశిరేఖా" అంటూ గది లోకి వెడుతూ పిలిచింది. ఏదో తెలియని భయంతో నిలువెల్లా ఒణికిపోయింది భారతి.

ఏముంది?

శశిరేఖ గదిలో లేదు!

"సూర్యం?" అని అరుస్తూనే తెలివి తప్పి పడిపోయింది భారతి. భారతి లేవడం చూసిన సూర్యారావు తనూ ఆమె వెనకనే లోపలికి వచ్చాడు. పడిపోబోతూండగానే భారతిని పట్టుకుని నెమ్మదిగా పడుకోపెట్టాడు. ఓ పది నిమిషాలకుగాని భారతి కళ్ళు తెరవ లేదు.

"ఏమైంది భారతీ? ఏమైంది?" అడిగాడు.

"శశిరేఖ లేదు!" అంది క్లుప్తంగా.

పక్కనే బాంబు పేలినట్టు అదరి పడ్డాడు సూర్యారావు.

"ఏమైంది?" అంటూ ఆదరా బాదరాగా లేచాడు సూర్యారావు. అతని చెయ్యి పట్టుకుని ఆపింది భారతి.

"అంతా పెద్దవాళ్లు ఉన్నారు.

వారు వెళ్లాకగాని అమ్మగారికి తెలియ నీయవద్దు," అంది.

వెనకవక్క పెరటి తలుపులు తెరచి ఉన్నాయి.

పక్క బల్లమీద ఉండే శశిరేఖ పెట్టె లేదు.

'ఎంత దారణం చేసింది శశిరేఖ!' అని నిట్టూర్చింది భారతి.

ఎక్కడికి వెళ్ళి ఉంటుం దన్నది ఆలోచించడానికి ప్రారంభించింది – కాని ఎలా తెలుస్తుంది?

## 8

అతిథు లందరూ వెళ్లిపోయారు. నిశ్చింతగా కుర్చీలో చేరపడి కూర్చు న్నారు జమీందారిణి.

ఆమెకు ఒకపక్కగా కూర్చుంది భారతి. రెండోపక్కగా సూర్యారావు కూర్చున్నాడు.

"అమ్మా శశిరేఖ మన నందరినీ మోసంచేసి వెళ్లిపోయిందమ్మా!" అన్నాడు సాధ్యమైనంత ఆవేశరహి తంగా.

మొదట ఆ మాటలు గ్రహింపు కాలే దామెకి.

"ఏమిటి సూర్యం నువ్వనేది?" అడిగారు రెట్టించి.

"మనందరి కళ్లూ కప్పి వెళ్లి పోయింది శశిరేఖ; పెట్టెకూడా లేదు," అన్నాడు సూర్యారావు.

ఆ మాటలు విని అదిరిపడ్డా రామె. "నిజమా? నిజంగానా?" అన్నా రే గాని ఆ మాటకూడ పూర్తికాకుండానే కుర్చీలో కుప్పగా కూలిపోయారు. భారతీ, సూర్యారావూ కలిసి ఆమెని నెమ్మదిగా పడకమీద చేర్చారు.

రాత్రి రెండుఝాములు గడిచింది. అయినా ఆమెకు తెలివి రాలేదు.

తెల్లవారింది. అయినా ఆ ఇంట్లో అంతా చీకటే నిండివుంది.

పూర్తిగా వెల్గు రాకుండానే బట్టలు వేసుకు బయలుదేరాడు సూర్యారావు.

"అమ్మ జాగ్రత్త. నేను పోలీసు రిపోర్టు ఇచ్చివస్తా," నని భారతి చేయి నొక్కి వెళ్లిపోయాడు.

"ఈఇంటిలో ఆత్మశాంతి పోయి, అది ఇప్పుడిప్పుడే తిరిగి వస్తోంది – అనుకున్నది కాస్తా ఎండమావి అయి పోయింది. దీని కంతకీ నేనే బాధ్యు రాలిని," అంటూ లోలోన కుమిలిపో సాగింది భారతి.

తెల తెలవారుతూండగా వెళ్లిన సూర్యారావు మిట్టమధ్యాహ్నం దాకా తిరిగి రాలేదు. వచ్చాకకూడా తిన్నగా తనగదిలోకి వెళ్లిపోయాడు. నెమ్మదిగా తలుపు తోసుకుని అతని గది లోకి వెళ్లింది భారతి. కళ్ళకి చెయ్యి అడ్డం పెట్టుకుని టేబిల్‌మీద కాళ్ళు పడేసి మూల్చుకున్నాడు సూర్యారావు. అతని తీరులోనే కన్పిస్తోంది – అత నిలో ఆవహించిన నిస్పృహ.

"నేను అన్నిటా ఓడిపోయినదాన్ని. మీరంతా కలిసి నాపై పెట్టిన నమ్మ కాన్ని వమ్ము చేసుకున్నాను. క్షమిం చండి," అంది భారతి అతని చెంత నిలబడుతూ.

తలెత్తి భారతిముఖంలోకి చూశాడు సూర్యారావు.

దైన్యం గూడు కట్టుకొన్న ట్టుంది భారతి ముఖం.

"లేదు భారతీ! మన బంగారం మంచిది అయితే కదా! ఎదుటివారి నని ప్రయోజనం శూన్యం. మమ్మల్నీ నిన్నూ ఒక్కలాగే నమ్మించింది శశి రేఖ. 'వెలుగువెన్నెలబాటలు పరుస్తాం నీకోసం, రా,' అంటేమటుకు 'చీకటి దారే బాగుంది' అనే మూర్ఖుల ను ఎవరు మార్చకలరు? నువ్వేం బాధ పడకు," అన్నాడు సూర్యారావు, భారతిచేయి తనచేతిలోకి తీసుకుంటూ, "అమ్మ ఎలా ఉంది?" అన్నాడు.

"మీరు వెళ్ళాక డాక్టరు వచ్చారు. ఏమిటో అంతా నిరుత్సాహంగానే ఉంది...పోనీ నేను వెళ్లిపోతే?" అంది భారతి. తనరాక ఈ ఇంటిదీపం ఆర్పి నట్టు అనిపించింది భారతికి.

భారతి పడుతున్న కోత సూర్యా రావుకి అర్థం కాకపోలేదు. భారతిని తన వడిలోకి లాక్కుంటూ, "చూడు భారతీ! ఆమాట ఎప్పుడూ అనకు. నా హృదయంలోని వెల్గు ఇప్పుడు కనబ డదు నీకు. శశిరేఖని ఎక్కడున్నా సరే ఈ ఇంటికి తెచ్చితీరుతాను. నువ్వు వెళ్లిపోతే అమ్మని ఎవరు చూస్తారు? మనకి ఇంతకుముందే పెళ్లి అయిపోయి ఉంటే ఈమాట అనిఉండేదానవా?" భారతి ముఖం తనవైపు తిప్పుకొ న్నాడు. ఏమీ సమాధానం చెప్పలేక కళ్ళు దించుకొంది భారతి.

రోజూ సూర్యారావు బయటికి వెళ్లి వస్తున్నాడు. కాని. కొత్త విషయా లేమీ ఉండడం లేదు.

ఒకరోజు అతను బయటికి వెళ్లాడు. శశిరేఖ వెళ్ళిపోయిన నాటి నుంచీ మంచం పట్టిన జమీందారిణిని భారతే చూసుకుంటూంది.

పదిగంటల వేళ ముందు హాల్లో కూర్చుని ఏదో పుస్తకం చూస్తూంది భారతి.

"అమ్మాయిగారూ, ఈ కాగితం ఎవరో ఇచ్చారు," అంటూ ఓ కాగితం పట్టుకుని తోటమాలి వచ్చాడు.

కాగితం అందుకుంది భారతి. ఆ చేతివ్రాత చూసి అదరిపడింది. అది బాగా గుర్తు.

మోహన్ హెచ్చరికలాంటి లేఖ వ్రాసి పంపాడు!

"గురవయ్యా, ఇదెవరిచ్చారు?" అడిగింది.

"ఎవడో చిన్న కుర్రాడిచ్చి పోయాడమ్మాయిగారూ!" అంటూ

దాని ప్రాముఖ్యం తెలియని గురవయ్య తన పనిమీద వెళ్ళిపోయాడు.

పిరికి గుండెలతోనే కాగితం మడత విప్పింది భారతి. చాలా కటువైన ఉత్తరం అది. శశిరేఖని ఎరగా పెట్టి బెదిరిస్తున్నాడు మోహన్.

"నాకు శశిరేఖని పెళ్ళి చేసుకోవడం కాదు ముఖ్యం. ఆ కుటుంబానికి బుద్ధి చెప్పడం – ఆ సంగతి గ్రహించ కలవాడు ఒక్క సూర్యారావే. అతగాడెందుకు శశిరేఖని నిర్బంధంలో ఉంచా లని చూశాడో ఇప్పుడర్థం అవుతోందా మీకు? ఈరోజు మీ రోసారి రండి. నాతో పేచీ మంచిది కాదని సూర్యానికి చెప్పండి. ఇన్నాళ్ళూ అతగాడు లెక్కలేకుండా నన్ను అడ్డుకున్నాడు. ఇప్పుడు నాపై ఏ చర్య తీసుకున్నా శశిరేఖ గతి జ్ఞాపకం చేసుకోమనండి. దేవాలయందగ్గిర మీకోసం చూస్తాను," అని ఉంది. ఎంత ధైర్యం అని వింత పడింది భారతి.

బయటికి వెళ్ళిన సూర్యారావు ఎంతకీ తిరిగిరాలేదు. ఇక లాభం లేదని వంటావిడని జమీందారిణి దగ్గిర కూర్చోమని, తనే బయలుదేరింది భారతి. మోహన్‌తో మాట్లాడి శశి రేఖని ఇంటికి తీసుకురావాలని ఆమె పిచ్చికోరిక.

నిర్భయంగానే దేవాలయం దగ్గిరకి వెళ్ళింది. తొలుత ఉత్తరం ఇవ్వడానికి ఎలా కాచి నిలబడ్డాడో అలాగే నిలబడి ఉన్నాడు మోహన్. 'ఇంత అందమైన వాడు., చతురతతో మాట్లాడ కల్గిన వాడు; కాని హృదయం ఎంత కలుషితం, అనుకుంది భారతి. అతగాణ్ణి చూసేసరికి వళ్ళు తెలియని కోపం వచ్చింది.


"చేసిన నిర్వాకంచాలక ఇదేమిటి ?" అడిగింది సూటిగా.

"మీకు కొంచెం ఇంగితం ఎక్కువ అనుకున్నాను. మీరూ వాళ్ళలాగే తయారవుతున్నారే!" నవ్వుతూ అన్నాడు.

"ఆ ఉత్తరం పోలీసుల కిచ్చి నా వెంట తీసుకువచ్చి ఉంటే ఏం చేసే వాడివి?"

"మీ రలా చెయ్యరని తెలిసే రాశాను. ఇక వ్యవహారం మాట్లాడుకుందాం. వ్యవధి లేదు. నే నా యింటి ఆడబిడ్డ కడుపున పుట్టిన దోషాన ఇలా గతి లేకుండా తయారయానని మీకు తెలియకపోవచ్చును. కాని నాకు తెలుసు. బాగా తెలుసు. ఏభయివేలు యిచ్చి శశిరేఖని తీసుకుపొమ్మనండి. నా కషా తీరుతుంది. నా తల్లి చెడి పోయిందని ఇంట్లోంచి గెంటించారే! ఇప్పుడీ శశిరేఖని ఏం చేసుకుంటారో నేనూ చూస్తాను," అన్నాడు.

అతగాడి గుండెలుతీసిన మాటలకి అనరిపడింది భారతి.




"నేను శశిరేఖని చూస్తేగాని ఏ సంగతీ చెప్పను," అంది ఖచ్చితంగా భారతి.

వ్యంగం ఉట్టిపడేలా నవ్వాడు మోహన్.

"మీలాగా భవంతుల్లో నివాసం అంత మంచిది కాదని తగినచోటే మకాం పెట్టాను. మొదట్లో, పాపం, శశిరేఖ బాధపడింది–ఈపరికి అలవాటు పడిందనుకోండి – మీకు చూపెడతాను. అయితే మీరు మాట్లాడ్డానికి వీలు లేదు," అన్నాడు.

"ఏం? ఎందుచేత?" అడిగింది భారతి.

"ఏమో, మీ ఇద్దరూ లాలోచీపడితే నా షరతుల గతేంకాను? నా షరతులకి ఒప్పుకోనేదాకా ఎవ్వరూ శశిరేఖను పలకరించడానికి వీలులేదు," అన్నాడు.

"సరే అయితే, నేను కళ్ళారా శశిని చూడాలి. తరువాతగాని మాట్లాడను," అని మౌనంగా అతనివెనుక నడవడం ప్రారంభించింది భారతి.

అలా అతనివెంట ఎంతదూరం నడిచిందో! పూరిగుడిసెలు, రోడ్డువార కుళ్ళునీళ్ళలో పొరిలేపందులు, మురుగు కాలవలమీది చిన్న కర్రవంతెనలు దాటి నడుస్తున్నాడు మోహన్.

ఒకచోట ఆగాడు. దూరంగా

గుంపుగా ఉన్నాయి పాకలు. వాటిలో ఒకదానివైపు చూపుతూ "అదిగో, అందాకా ఆపాకలోనే మకాం," అన్నాడు.

"మీ రిక వెళ్ళండి," అంటూ తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు. ఎంత దారుణం!

మనుషులమీద కక్ష ఇలాగా సాధిస్తారు?

కోపం, పగా - వీటికి ప్రేమా, అనురాగం ముసుగులు!

ఎంత విచిత్రం.

ప్రాన్పడి నిలబడిపోయింది భారతి.

## 9

వచ్చిన దారివెంట ఇంటిముఖం పట్టింది భారతి. ఆమె మనస్సు మనసులోలేదు. 'ఈదారుణం వింటే అమ్మగా రేమైపోతారు? సూర్యం ఎంత బాధపడతాడు! దానికి పర్యవసానం ఎలా ఉంటుందో?' అనుకుంటూ తల వంచుకొని గబగబా నడుస్తూంది భారతి. పక్కగా వచ్చి ఆగిన కారుని చూడనేలేదు చప్పుడు కూడా వినబడలేదు భారతికి.

"రా భారతీ! ఇంటికిపోదాం," అంటూ కారు తలుపు తెరిచి పిలిచాడు సూర్యారావు.

నిద్రలో నడుస్తున్న మనిషిలా వచ్చి కారెక్కింది.

"ఎక్కడికి వెళ్ళావు? తమ్మ నువ్వు రాలేదని ఇప్పటి కెన్నోసార్లు అడిగింది. నేనే చూద్దామని బయలుదేరాను," అన్నాడు కారు స్టార్టుచేస్తూ.

"సూర్యం! ఈ దారుణాన్ని విన్నావా? నేను మోహన్‌ని కలుసుకున్నాను;" అంది; కోపంతోటీ, ఆవేశంతోటీ నోట మాటరా లేదు భారతికి.

"అంత ఆవేశపడకు భారతీ. ఈ చుట్టుపక్కల ఎక్కడున్నా వాడు నన్ను తప్పించుకుపోలేడు. పోలీసులు వల పన్నే ఉంచారు వాడికోసం," అన్నాడు అనునయంగా.

"నీ కసలు తెలియడం లేదు. వాడు కసాయికంటే అన్యాయం. నువ్వు వాడి చేతుల్లోంచి శశిరేఖని రక్షించలేవు సూర్యం, రక్షించలేవు;" గూడు కట్టుకొన్న దుఃఖం ఉప్పెనలాగా పొంగి నోట మాట రాలేదు భారతికి.

చేతుల్లో ముఖం దాచుకొని భోరున ఏడ్చింది

ఇల్లు చేరగానే నెమ్మదిగా అన్ని విషయాలు తెలుసుకున్నాడు సూర్యారావు. మోహన్ వ్రాసిన ఉత్తరం తీసుకొని తిరిగి అప్పుడే బయలుదేరి వెళ్ళిపోయాడు.

ఉట్టి బెదిరింపులకు లొంగేవాడు కాదు మోహన్ అని తెలుసుగాని, మరీ ఇంత దారుణానికి తెగించేవాడని ఊహించలేకపోయాడు. శశిరేఖని

పెళ్ళి చేసుకోవాలన్న కోరిక ఉంది కాబోలు అన్న అనుమానం ఎప్పుడేనా తలెత్తినా, దాన్ని అణచివేసేవాడు. కాని ఇలా పగ సాధించడానికే ప్రేమ నటించి అమాయకురాలైన శశిని మోసం చేస్తాడని సూర్యారావు ఊహ కేనా అందలేదు. ప్రస్తుత కర్తవ్యం అంతా శశిరేఖని రక్షించడమే. అది తనొక్కడివల్లా సాధ్యం కాదు. అందుకే మోహన్ ఉనికి విషయంలో తెలిసిన ఈ కొత్త సమాచారం తక్షణం పోలీసులకి అందచేయాలి అనుకున్నాడు సూర్యారావు.

అంతా ఎంత త్వరగా రంగంలోకి దిగితే అంత మంచిదని తక్షణమే బయలుదేరాడు సూర్యారావు.

భారతి కాలు కాలిన పిల్లిలాగా ఇంట్లో తిరుగుతోంది - ఏం చేయాలో తోచని స్థితిలో ఉంది.

"అమ్మాయీ! మళ్ళీ సూర్యం బయటికి వెళ్ళాడా?" అడిగారు జమీందారిణి.

"అవునమ్మా, శశిరేఖ విషయంలో కొత్త సంగతులు తెలిశాయని పోలీసు స్టేషనుకి వెళ్ళారు," అంటూ ఒడిలిన ఆమె చేయి తన చేతిలోకి తీసుకుంటూ మంచంపక్కనే కుర్చీలో కూర్చుంది భారతి.

"మీ ఇద్దరూ కలిసి నాదగ్గిర ఏదో దాస్తున్నారు. నిజం చెప్పు భారతీ!" దీనంగా అడిగారు.

ఆమెకు మనశ్శాంతి కల్గేలా చేయాలంటే నిజం చెప్పడం ఒకటే అనుకుంది భారతి. తరువాతేనా అన్నీ తెలిశాక బాధపడతారు గాని, మానరు కదా?

"మోహన్ మీ రనుకునే మోసగాడే కాదు; దుర్మార్గుడుకూడా నమ్మా. ఈ రోజు ఉత్తరం రాసి పంపాడు," అని తను వెళ్ళడం, తిరిగి సూర్యారావు తీసుకురావడం. మొదలైనవన్నీ వివరంగా చెప్పింది.

"రేపీ పాటికి మన శశిరేఖ మనింట్లో ఉంటుందమ్మా! మీ రేం బెంగపడకండి," అని ఓదార్చింది.

"నీకు తెలియదు భారతీ! మోహన్‌దికూడా వాడి తండ్రిపోలికలా వుంది;" గతంలోకి తవ్వుతూ చెప్తున్నా రామె.

"వారి చెల్లెలు నా ఆడబిడ్డ - మన శశిరేఖ లాగే చాలా అందంగా ఉండేది; చాలా మొండి. మన శశిరేఖది ఆ పోలికే తల్లీ! ఎవరినో ప్రేమించాను, అతగాణ్ణి తప్పించి పెళ్ళి చేసుకోను అని పట్టుపట్టింది. ఆ ఎవరో వాణ్ణి గమ్మన్నారీయన. అతగా డెందుకు వస్తాడూ? చివరికి తేలింది - అమ్మాయి నెల తప్పిందని. ఈయనదా ముక్కోపం. వెనకా ముందూ చూసే అలవాటే లేదు. ఇంట్లోంచి ముందు బయటికి పొమ్మన్నారు. నే నెంత వద్దని మొత్తు

కున్నానో, ఆ భగవంతుడికే ఎరుక. ఆ పిల్లమటుకు తక్కువదా! 'చంపుతే చంపు, నే వెళ్ళను అన్నయ్యా!' అని కాళ్ళమీద పడకూడదూ? ఉహుఁ, నేను బయటికిపోయి అతగాణ్ణే పెళ్ళి చేసుకుంటాను. నీ లెక్కేమిటి అని వెళ్ళిపోయింది. అంతే, తరువాత నాలుగైదేళ్ళదాకా ఆ అమ్మాయి సంగతే తెలియలేదు. చాలా నికృష్టపు బ్రతుకులో పడిపోయిందని వినడమే గాని కళ్ళారా చూడలేదు. ఆ చేసుకుంటానన్నవాడు చేసుకోలేదు. ఎలా బ్రతికిందో ఆ దేవుడికే తెలియాలి. తల్లీ తండ్రీ లేనిదాన్ని ఇంట్లోంచి పొమ్మన్నానే అన్న మనోవ్యధ వారిని బ్రతికి ఉన్నంతకాలం పీడించింది. కాలం, మనకి ఇష్టం లేనప్పుడు, క్షణాలమీద గడిచిపోతుంది. మన శశి పూర్తిగా పధ్నాలుగేళ్ళుకూడా నిండకుండానే మొండిగా తయారైంది. అది చూసి వారి కింకా చింత పెరిగింది. స్నేహితుల ఇళ్ళకనీ అక్కడికనీ ఇక్కడికనీ వెళ్ళి ఎవరినో కలుసుకుంటూందన్న సంగతి మాకంటె ముందు మాలిక్కి తెలిసింది. వా డీనాటివాడా? ఆ పిల్లవాడి నిట్టే గుర్తుపట్టేశాడు. వాడెలాంటి బ్రతుకు బ్రతుకుతున్నాడో ఆరా తీశాడు. ఓ రోజు బాగా తన్నించాడుకూడా. దానితో మోహన్‌కి పంతం పెరిగింది. ఇటు శశిరేఖా మొండికెత్తింది. ఈ బెంగతోనే వారు కన్ను మూశారు భారతీ!' దీర్ఘంగా నిట్టూర్చా రామె.

"అవన్నీ పీడకల లనుకోండమ్మా. అన్నీ గడిచిపోయాయి. ఇక శశిరేఖ సుఖంగా ఇంటికి వస్తుందిగా;" ధైర్యం చెప్పాలని చూసింది భారతి.

"నా కా నమ్మకం లేదు భారతీ! అదంతా అత్తపోలికే. సూర్యం దాన్ని తిరిగి రానివ్వడు," అన్నారు నిస్పృహగా.

"మీ రలా అనకండి. జరిగినదానికెంతగానో బాధపడుతున్నారు వారు. తప్పకుండా ఆయనే శశిని తీసుకు వస్తారు చూడండి," అంది లేని ఉత్సాహం తెచ్చుకుంటూ.

బయటికి వెళ్ళిన సూర్యారావు తిరిగి వచ్చాడు. తల్లిని చూస్తే అతనికి మరీ బెంగగా ఉంది.

"నీ కేం భయం లేదమ్మా! శశిరేఖని తీసుకువచ్చి నీకు అప్పగిస్తాంగా!" అంటూ తల్లిని ఓదార్చాడు.

రాత్రి చాలా సేపటివరకూ ఇద్దరూ మాట్లాడుకుంటూ కూర్చున్నారు. ఒకరికొకరు ధైర్యం చెప్పుకున్నారు. 'ఇదెంతవరకు' సాధ్యం? అన్న అనుమానం ఇద్దరి మనస్సుల్లోనూ ఉంది. అది పైకి గట్టిగా అనే ధైర్యం ఇద్దరిలోనూ లేదు.

కలత నిద్దురలతోనే తెల్లవారింది రాత్రి.

"ఉదయం తొమ్మిదింటికి ఇనస్పెక్టరుగారు వస్తారు భారతీ! నీ వెంట మేమంతా మోహన్ చూపెట్టిన ఇంటికి వస్తాం," అని చెప్పాడు సూర్యారావు.

తల్లికి ధైర్యం చెప్తున్నకొద్దీ సూర్యారావు ధైర్యం కొరవడుతూంది.

"మనం చాలా జాగ్రత్తగా ఉండాలి. ఏ మాత్రం అనుమానం కల్గించకూడదు. అందుచేత మిస్ భారతిని ముందుగా వెళ్ళనిద్దాం. ఆమెను మనం వెన్నంటి వెళ్ళవచ్చు," అని ఇనస్పెక్టరు సూచించడంతో పుంజుకున్న ధైర్యం కాస్తా సన్నగిల్లింది సూర్యారావుకి.



## 10

గుడిసెల ప్రాంతాలకి కొంత దూరంగానే భారతిని దింపేశారు. అప్పటికే ఎండ తీక్షణంగా ఉంది. గుడిసెలలోనుంచి వంట వాసనలు వస్తున్నాయి. ఎక్కడోగాని సందడే లేదు. కూలీనాలీ చేసుకునేవాళ్ళంతా పనుల్లోకి పోయినట్టుంది. దూరంనుంచి మోహన్ చూపిన గుడిసెలోకి అడుగు పెట్టింది భారతి. అక్కడేముంది? ఖాళీ! ఎదురు చూడని ఈ ఫలితానికి బెదిరిపోయింది. అదరా బాదరాగా ఇవతలికి వచ్చింది. ఈ అలికిడి విని పక్క గుడిసెలోంచి చింకిచీరా, చిందరవందరగా ఉన్న జుట్టుతో ఒకామె బయటికి వచ్చింది.

'అమ్మాయిగారూ!' అంటూ భారతిని కేక వేసింది భారతి వెనక్కి తిరిగి చూసింది. ఇటు రమ్మన్నట్టు సౌంజ్ఞ చేసిం దామె. అదే క్షణంలో భారతికి తోచింది. చుట్టుపక్కల వాకబు చేస్తే ఏమైనా సంగతులు తెలుస్తాయేమోనని. ఆతురతతో పిలుస్తున్న ఆమె దగ్గిరికి వెళ్ళింది.

"నిన్న రాత్రికి రాత్రే గుడిసె ఖాళీ చేసేసి పోయాడు. ఆ పిల్లది ఒకటే గోల. కాని ఈడ్చుకు వెళ్ళిపోయాడు. 'ఈ రెండు ముక్కలు గీకింది కాబోలు,

ఎవరేనా వస్తే ఇవ్వమంది," అంటూ బొడ్డులో దోపిన ఒక కాగితం బయటికి తీసింది.

లాక్కున్నంత త్వరగా ఆ కాగితం అందుకుంది భారతి. ఎంతో నిస్పృహతో నిండి ఉన్నాయి వ్రాసిన నాల్గు పంక్తులూ – "రాత తప్పించలే రన్నది నేను నిరూపించాను మిస్! నన్ను మరిచిపొండి. అనవసరంగా మీ రంతా బాధలపాలు కావద్దు. అవమానాల పాలు కావద్దు. మోహన్‌తో ఏ విధ మైన ఒప్పందానికీ దిగకండి. అది రెండువిధాలా నష్టం తప్పించి వేరు ఫలితం లేదు. సెలవు. మళ్ళీ కలుస్తా ననుకోను;" సంతకంకూడా లేదు. అది చదువుతూ ఉంటే భారతి కళ్ళని నీటిపొర కప్పివేసింది.

"ఇక్కణ్ణుంచి ఎటు వెళ్ళి ఉంటారో కొంచెమేనా చెప్పకలవా?" అడిగింది భారతి.

"ఎక్కడా కొంప చూసినట్టులేదు. అయినా అటేపు పోయారు. వాకబు చెయ్యి," అంటూ పని అయిపోయి నట్టు లోపలికి పోయింది దా మనిషి.

వెనక్కి వెళ్ళి సూర్యానికి చెప్పాలా? ఆమె చూపిన దారివెంట ముందుకి సాగాలా? నిర్ణయించుకోలేక తికమక పడింది భారతి. పోలీసులూ బందో బస్తూ కల్పించుకుంటే ఏం అఘాయిత్యం చేస్తాడో ఈ మోహన్ అన్న అను మానం రావడంతో ముందుకే సాగి పోయింది భారతి. మురుగు కాల్వలు, పూరిగుడిసెలు దాటుకుంటూ ఎంతో దూరం వెళ్ళింది. ఏ సంఘసేవికో అనుకున్నారుకాబోలు ఎవరూ అంతగా భారతిని పట్టించుకోలేదు! అక్కడక్కడ వాకబు చేస్తూ ముందుకే నడుస్తూంది భారతి.

"ఇక్కడి కెవ రేనా కొత్తగా వచ్చారా?" ఎంద రెందరినో అడిగింది.

ఎవరికి వారే, చెప్తే ఏం గొడవో అన్నట్టు 'తెలీదు' అనేస్తున్నారు. తమకి అనవసరపు శ్రమ అని ఎదుటి వ్యక్తి కష్టసుఖాలని చిన్నమెత్తు కూడా పట్టించుకోరు సామాన్యులు. 'తనను తప్పించి ఊరంత పిడుగు!' అన్నట్టు ఉంటుంది వీరి ధోరణి. చివరికో పదేళ్ల పిల్లని దారిలో ఆపింది భారతి. రేకు డబ్బాతో నీళ్లు పట్టుకు వస్తూం దాపిల్ల. అందరినీ అడిగినట్టే అడిగింది భారతి. బెదురుగా అటూ ఇటూ చూసిం దా పిల్ల. "వాళ్ళు మీకు తెలుసా?" అడిగింది.

"అవును; ఎక్కడున్నారు?"

"ఇంకో నాలుగు గుడిసెలు దాటి ఎడంకి తిరగండి. ఆ పక్క గుడిసెలోకి ఎవరో వచ్చారు." డబ్బా సరిగా సర్దు కుని వెళ్ళిపోయింది పిల్ల.

దడదడలాడుతున్న గుండెలతో ముందుకి సాగింది భారతి. ఎవడో తనని

చూసుకుంటూ దాటిపోయాడు. సందేహం లేదు. అతడు మోహన్. ఆశ చిగురించింది భారతిలో. మళుపు తిరిగేచోట నిలబడ్డాడు మోహన్. అతని తీరు పిచ్చివాని తీరులాగా తోచింది భారతికి.

భారతిని సమీపానికి రానివ్వి, "ఆగండి. ఒక్క అడుగు ముందుకు వేసినా జాగ్రత్త! మీరంతా మర్యాదస్థులు కదూ? గౌరవంగా బ్రతికే వాళ్ళు!" అని కంట్రోల్ లేకుండా నవ్వడం ప్రారంభించాడు మోహన్.

"ప్లీజ్. నన్ను శశిరేఖని చూడనివ్వండి. మీ ఇద్దరికీ ఏమీ ప్రమాదం రాకుండా చూసే పూచీ నాది." ఇంకా ఏదో చెప్పబోయిన భారతి మాటలు మధ్యలోనే ఆపేశాడు మోహన్.

"అందుకే కాబోలు పోలీసు బలగం గూడెం చుట్టూ నిలబెట్టారు. ఒక్క అడుగు ముందుకు వచ్చినా, ఇక మీరూ మాతో పాటే," అని చటుక్కున వెనుదిరిగి గుడిసెలోకి రెండంగల్లో వెళ్ళి తడిక తలుపు చేరవేశాడు మోహన్.

భారతి తెగింపు తెచ్చుకొని ముందుకి సాగేలోపలే గుడిసెలోంచి నల్లని పొగలు బయలుదేరాయి. 'శశిరేఖా!' అంటూ అరుస్తూ ముందుకి పరుగెత్తింది భారతి.

బాగా ఎండ ఎక్కి ఉంది. గుడిసెల తాటాకులు గలగల్లాడుతూ ' ఎండి ఉన్నాయేమో - బుస్సున అంటుకున్నాయి. దట్టమైన పొగతో జన. కేకలతో ఆ ప్రదేశంఅంతా బీభత్సంగా తయారైంది.

## 11

భారతి వెనకనే వస్తున్నాడు సూర్యారావు. దూరంనుంచే భారతిని చూస్తూ నడుస్తున్నాడు. అంటుకొన్న పాకకేసి పరుగుపెట్టాడు. అప్పటికే బాగా మంటలులేచాయి. వీస్తున్న గాలి, మంటలిని విపరీతంగా విస్తరింపచేసింది. గుడిసెముందు బోర్లాపడి ఉంది భారతి.

భారతిని రెండుచేతులా ఎత్తుకుని మంటలకి దూరంగా తీసుకువచ్చాడు సూర్యారావు. పోలీసుల ఈలలతో ఫైరింజనుల చప్పుళ్ళతో పిల్లల ఏడుపులతో, సామానులు రక్షించుకొనే వారి గోలతో - ఆ వాతావరణం నిండిపోయి భయంకరంగా ఉంది.

అంతా సద్దు మణిగేసరికి గూడెం కాస్తా స్మశానంలాగా తయారైంది. ముప్ఫయికి పైగా గుడిసెలు తగలబడిపోయాయి. ఎంతో కష్టంమీద లోపలికి ప్రవేశించిన రక్షకులు శశిరేఖ శరీరాన్ని ఇవతలికి మోసుకువచ్చారు. అది చూసి సూర్యారావు చిన్నపిల్లవాడులాగా గొల్లుమన్నాడు. కాస్సేపటికి మోహన్‌ని కూడా మోసుకువచ్చారు. బాగా కాలిపోయాడు. చూడ్డానికే

భయంకరంగా ఉన్నాడు. కొనవూపిరి ఆడుతూంది.

కాలినవాళ్ళ నందరినీ ఆస్పత్రికి చేర్చారు. శశిరేఖ ఒళ్ళు ఎక్కువగా కాలనేలేదు. 'షాక్‌కి ప్రాణం పోయింది' అని అన్నారు డాక్టర్లు.

మోహన్‌కూడా బ్రతికే అవకాశం లేదన్నారు. మాట్లాడించవచ్చు అని డాక్టర్లు చెప్పగానే పోలీసు లతని చుట్టూ చేరి మరణవాఙ్మూలం వ్రాసుకున్నారు.

"నా తల్లికి జరిగిన అన్యాయానికి పగబట్టాను. ఇంత జరుగుతుందని నేను ఊహించలేదు," అన్నాడట. "అభం శుభం ఎరుగనిదాన్ని ప్రేమించినట్టు నటించి పగసాధించావా?'' అంటూ ముఖం కప్పుకు ఏడ్చాడు సూర్యారావు.

''భారతి ఒళ్ళు అక్కడా అక్కడా కొంచెమే దెబ్బతిన్నది. కాని ప్రమాదం ఏంలేదు," అన్నారు. స్పృహ రావడానికే ఒకరోజు పట్టింది.

''నే నన్నదే నిజం అయింది," అని వాపోయారు జమీందారిణి.

''నా కన్నతల్లి కష్టాలు గట్టెక్కాయి. లేకుంటే ఎలా బ్రతకవలసి వచ్చేదో!" అని తన ముద్దులకూతురు మరణంతో పరిష్కారం చూడకలిగా రాయి

భారతికి తెలివి వస్తుందని అలా ఆస్పత్రిలోనే కాచుకుని కూర్చున్నాడు సూర్యారావు.

ఎంతో బాధతో తెరవలేక తెరవలేక తెరచినట్లు కళ్లు తెరిచింది భారతి. ఎదురుగా ఉన్న సూర్యం ఏదో పొగలోంచి కన్పడ్డట్టు కనపడడంతో ఒక్క కేక వేసింది.

"భారతీ! నేను సూర్యాన్ని. ఇటు చూడు," అని భారతి రెండు చేతులూ పట్టుకొని ఆమెపక్కనే కూర్చున్నాడు.

మెల్లిగా కళ్లు తెరచి చూసింది భారతి.

కళ్ళకింద నల్లని చక్రాలు కమ్మి అలసిన ముఖంతో ఉన్న సూర్యారావుని రెప్పవాల్చకుండా చూసింది.

"శశిరేఖ ఏది?" అడిగింది.

"లేదు, భారతీ! శశిరేఖలేదు. అది చాలా అదృష్టవంతురాలు. ఒళ్ళుకూడా కాలకుండా కన్ను మూసింది. మనల్ని అందరినీ వదిలి వెళ్లిపోయింది భారతీ!" అన్నాడు సూర్యం.

"అమ్మకీ సంగతి చెప్పారా? నన్నెందు కిక్కడ ఉంచారు?" అని అడిగింది.

"నిన్నటినుంచీ నీ కసలు తెలివి రాలేదు. నువ్వుకూడా నన్ను మోసం చేసి వెళ్లిపోతావేమో నని భయపడ్డాను," అంటూ ఆమె గుండెలమీద వాలిపోయాడు సూర్యం.

అలాగే అతని తల నిమురుతూ ఊరుకుంది భారతి.

మోహన్ దొరికాడా?" అడిగింది.

"ఓ అరగంట క్రితమే అతగాడూ పోయాడు."

అలాగే ఉండిపోయింది భారతి. ఇంత దారుణం జరుగుతుందని ఎవరూ ఊహించలేదు. పాపం! శశిరేఖ ఎంత మోసపోయింది.

"నాతో ఎప్పుడేనా చెప్తూ ఉండేది మోహన్ గురించి. అతనిపై ఎంత అనురాగం పెంచుకుందీ అమ్మాయికు రాలు. 'అతనివేళ్లు చిత్రకారుని వేళ్ళ లాగా ఉంటాయి' అనేది; అతని మాటల్లో తేనెలు, చూపులలో పూల పోనలే చూసిందిగాని, పిచ్చిది, అతని హృదయంలో కల్మషం గుర్తించలేక పోయింది." సగం స్వగతంగా మాట్లాడు కుంటున్న భారతిని వద్దని వారించాడు సూర్యం.

"వద్దు భారతీ! అవేవీ జ్ఞాపకం చేసి కోకు. అవన్నీ మరిచిపో. నీ ఆరోగ్యం దెబ్బతినకుండా చూసుకోవాలి," అన్నాడు.

"నాకేం రాదు. నేనూ చాలా మొండిదాన్నే," అంది భారతి.

"నువ్వు మొండివికాదు. లోకం పోకడ తెలిసినదానివి. నిన్ని సాయం త్రమే ఇంటికి తీసుకు వెళ్ళమన్నారు డాక్టరు;" ఆమెతల నిమురుతూ చెప్పాడు సూర్యం.

అలాగే సాయంత్రం అవగానే భారతిని తీసుకువెళ్ళడానికి వచ్చాడు.

"ఇంటికి వెళ్లి అమ్మగారి ముఖం ఎలా చూడను?" 'మీ శశిని మీకు అప్పగించి తీరుతాం' అన్నానే;" దుఃఖంతో పూడుకుపోతున్న కంఠంతో అంది భారతి.

"అమ్మ నీకంటే ధైర్యంగానే ఉంది భారతీ. శశి తిరిగి అత్తలాగా తయారౌతుందేమో అని బెంగపడి పోయింది అమ్మ," అన్నాడు సూర్యారావు

స్మశానంలోని ప్రశాంతత లాంటిది ఆవరించుకొంది జమీందారుగారి భవంతిలో. ఏళ్ళ తరబడి పెరిగిన ఆందోళన చేత్తో తీసివేసినట్టు సమసి పోవడంతో అందరిలోనూ ఒక రకమైన నిస్త్రాణ అలముకొంది.

## 12

ఇంటికి వెళ్ళిన నాల్గురోజులు నాల్గు యుగాలుగా గడిపింది భారతి. ఇటు సూర్యం ముఖం, అటు అమ్మగారి ముఖం చూడలేకుండా ఉంది. ఒకనాటి మధ్యాహ్నం నిశ్శబ్దంగా కూర్చుని పెట్టె సర్దుకోవడం ప్రారంభించింది. ఇక్కడ తన కింకేంపని? స్కూలుకి తిరిగి వెళ్ళిపోవాలని భారతి ఉద్దేశ్యం. తెరచిఉన్న పెట్టెముందు కూర్చుని ముసురుతున్న ఆలోచనలని తరువాత తరుముతూంది భారతి.

"ఏం చేస్తున్నావు భారతీ?" లోపలికి వచ్చారు జమీందారిణి. ఉలిక్కి

పడింది భారతి. తెరచిఉన్న పెట్టె గభా లున మూసింది.

"ఏంలేదమ్మా, పెట్టె సర్దుతున్నాను. నాకు శలవులు అయిపోయాయి కదా!" అంది.

"ఇం కెక్కడికి వెడతావమ్మా నన్ను వదిలి?" అన్నా రామె దగ్గరగా ఉన్న కుర్చీలో కూర్చుంటూ. 'ఇలా రా' అంటూ చేయి జాపి పిలిచారు.

లేచివెళ్ళి ఆమె దగ్గరగా క్రింద కూర్చుంది భారతి. భారతి తల నిమురుతూ కొంచెం సేపు ఏమీ మాట్లాడలే దామె.

"నే వెళ్ళిపోవాలమ్మా. ఈ పరి సరాల్లో ప్రశాంతంగా బ్రతకలేను. నా కా స్కూల్లోనే శాంతి లభిస్తుంది," అంది భారతి.

వస్తూన్న దుఃఖాన్ని ఆపుకోడానికి ప్రయత్నించింది.

"నేను శశితో స్నేహితురాలిగా వచ్చాను. అంతా సంతోషంగా ఉంటే మీ సేవ చేసుకుంటూ ఈ ఇంట్లో కొంచెం స్థలం చూసుకుందా మను కున్నాను. కలలు కన్నాను. శశిరేఖతో పాటే నా స్వాప్నికసౌధాలు కూడా పేకమేడల్లాగా కూలిపోయాయి. నన్ను వెళ్ళనివ్వండి," అంది ఆమె వడిలో తల దాచుకుంటూ.

"నీ అశాంతి నాకు అర్థం అవుతుం దమ్మా. శశిరేఖ నీలో ఒక అపనమ్మ కాన్ని లేవతీసింది. నిన్ను పూర్తిగా నమ్మేలా ప్రవర్తించి, పూర్తిగా మోసం చేసింది. వెర్రితల్లి! తనని తనే మోసం చేసుకుంటున్నా నన్న సత్యం గ్రహించలేపోయింది. దానికా గుడ్డి ప్రేమలో ఉచితానుచితాలు తెలియ లేదు. నిషేధించాం కనుక చేసితీరా లనుకుంది. చూడు భారతీ! 'ఇది వెల్గు బాట, ఇటు నడు' అని చెప్తాం. 'ఏం? అటెందుకు వెళ్ళకూడదు?' అని వెడితే ఏం చేయగలం చెప్పు? నువ్వు దాన్ని గురించి బెంగపడకు. నిజంగా దాన్ని మరణమే వెల్గులోకి పంపింది. నువ్వు ఉండే సూర్యానికి వెలుగు లేకుండా చేస్తావా?" అన్నారు.

మాతృప్రేమ నెరుగని భారతి కీ మాటలలోని ఆప్యాయత భరింపరాని ఆవేదన రేకెత్తించింది. ఆమె వడిలోనే అలాగే పడుకుని శోష వచ్చేదాకా ఏడ్చింది. మారుమటాడకుండా అలాగే కూర్చున్నా రామె.

'ఇక్కడా ఉన్నావు?' అంటూ లోపలికి వచ్చాడు సూర్యారావు.

"నాయనా, ఈరోజు మధ్యాహ్నం శాస్త్రుల్గారిని రమ్మన్నానని కబురు పంపు. పదిరోజులూ కాగానే ఏ ఆడం బరం లేకుండా మీ వివాహం జరిపి స్తాను," అన్నారు.

"అంత తొందరెందుకమ్మా?" అన్నాడు సూర్యం.



"కాకుంటే పరాయిపిల్ల మనింట్లో ఎన్నాళ్ళుంటుందిరా?" అడిగా రామె.

పడ్చిపడ్చి ఉబ్బినకళ్లు పైకెత్తి ఆమె ముఖంలోకి చూసింది భారతి – 'నన్ను అత్తే పెట్టడానికిదొక్కటే మార్గమా?' అన్నట్టు.

"నాకు పనుంది. చాలా సేపయి భారతి కనబడకపోతే ఇలా వచ్చాను. చూడు సూర్యం. భారతి పెట్టె సర్దుకుంటూంది – వద్దని నచ్చచెప్పు,"

అంటూ లేచి వెళ్ళిపోతున్న తల్లికేసీ, అలాగే బొమ్మలాగా కూర్చున్న భారతికేసీ క్షణంసేపు విస్తుపోయి చూశాడు సూర్యారావు. చేతులందించి భారతిని లేవదీశాడు; తన కౌగిట చేర్చుకొన్నాడు.

"ఇంత విషాదాన్ని నా ఒక్కడి మీదా పెట్టి వెళ్ళిపోదామనా?" అడిగాడు......

కన్నెపిల్ల కర్మ కేమంత గొడ

వుంటుంది? జమీందారీ కుటుంబమే అయినా అన్నీ సాధారణంగా జరిపించారు సూర్యారావుతల్లి...

కాలం శీఘ్రగతిని పరుగు పెడుతూంది పడి లేచేవారికోసం, సేద తీర్చుకోవాలని ఆగేవారికోసం కాలం ఆగుతుందా? ఆగదు. శాస్త్రుర్లుగారు చెప్పిన ముహూర్తానికి సూర్యారావుకీ భారతికీ దేవాలయంలో వివాహం జరిపించారు జమీందారిణి.

"మ వ్వీ ఇంటి దీపానివి. ను వ్వుంటేనే ఈ ఇంట వెల్గు. ఇది జ్ఞాపకం పెట్టుకో భారతీ," అని సూటిగా ఒక్క మాటలో కోడలి బాధ్యతని తెలియ చెప్పారు సూర్యం తల్లి. "నేను ఇల్లు బాగులు చేయిస్తాను. మీ రిద్దరూ పట్నంలో పదిరోజులు తిరిగిరండి," అన్నారు...

పట్నం బయలుదేరేముందు అత్త గారికి పాదాభివందనం చేసింది భారతి. ప్రేమతో లేవనెత్తి అక్కున చేర్చుకొన్నారు. "హాయిగా వర్ధిల్లు తల్లీ," అంటూ దీవించారు.

కారు బయలుదేరబోతూంటే "ఒరేయ్ సూర్యం, ఇన్నాళ్ళు ఆగినందుకు నీవు అదృష్టవంతుడివి నాయనా! భారతిలాంటి భార్య వెతికితే దొరుకుతుందా? అంతా ఘటన!" అన్నారు.

కారు బయలుదేరింది.

పక్క కూర్చున్న భారతి సూర్యం ముఖంలోకే చూస్తూంది. అతని చూపు మటుకు రోడ్డుమీదే ఉంది.

"దారిలో స్కూలుకి వెళ్ళి చూద్దామా?" అడిగింది భారతి. పక్కకు తిరిగి సన్నగా నవ్వాడు సూర్యం.

"ఏం, ఎందుకూ? మొన్ననే నేను ఉత్తరం పంపాను. కొన్నాళ్ళపాటు నువ్వు రాలేవని."

ఆ మాటకు నవ్వుకుంది భారతి. "అంటే?" అంది అర్థం కానట్టు.

"ఏమో భారతీ! 'నాకు ఏమీ తోచడంలేదు. వెళ్ళి పిల్లలకు పాఠాలు చెప్పుకుంటాను అంటే?'... అందుకే ఎందుకేనా మంచిదని అలా వ్రాశాను," అన్నాడు సూర్యారావు.

ఎప్పుడూ అలా అనవద్దు. మనిద్దరం ఉండగా నాకు తోచకపోవడం ఏమిటి?" చిరుకోపం నటిస్తూ అంది భారతి.

కాస్సేపు కారులో మౌనం తాండవ మాడింది.

"ఇలా మౌనవ్రతం పట్టి కూర్చుంటే నాకుమట్టుకు ఏం తోస్తుంది భారతీ!" స్టీరింగు మీద ఒకచెయ్యితీసి భారతి చెయ్యి అందుకున్నాడు సూర్యారావు.

నీరెండకూడా పోయింది. చిరుచీకటులు కూడా అలుముకోకుండా తరిమికొట్టే పున్నమి వెన్నల పరచు

కుంటూంది లోకంపై. ప్రశాంతంగా ఉన్న రోడ్డువెంట నెమ్మదిగా కారు సాగుతూంది. చల్లని గాలి కూడా వీస్తూంది.

ప్రశాంతంగా ఉన్న రోడ్డువార ఒక చెట్టుక్రింద కారు ఆపాడు సూర్యారావు. తన జీవితాంత ప్రేమని మాటలలో చెప్పి, తన ప్రేయసికి బహూకరించడానికి తగినస్థలం ఇదే అనుకున్నాడు.

అతని ఊహలను గ్రహించింది భారతి. సిగ్గుతో తల వంచినా మెరిసే కన్నుకొసలతో ఆసక్తితో సూర్యం కేసి చూసింది.

"ఇక మనం ఒకటి," అన్నాడు సూర్యారావు. "ఇన్ని యుగాలు నువ్వెక్కడ ఉన్నావు?'' అన్నాడు.

"ఇవన్నీ ఇప్పుడు ఎవరు అడగమన్నారు?" చిలిపిగా అడిగింది భారతి.

"అదిగో అటు చూడు," అంటూ అప్పుడే పైకి వస్తూ కమిలినట్టున్న ఎర్రని చంద్రుణ్ణి చూపెట్టాడు సూర్యారావు.

ఆ చూపుతున్న చేతినే మళ్లించి భారతిని తన కౌగిట చేర్చుకున్నాడు.

అంత సంతోష సమయంలోనూ దుఃఖం వచ్చింది భారతికి.

"ఎందుకూ?" అన్నాడు.

"ఏం లేదు. ఈ ఆనందం, ఈ వెల్గూ అన్నీ నాకు దడపుట్టిస్తున్నాయి," అంది తన ముఖం అతని గుండెల్లో దాచుకుంటూ.

"పోదాం పద," అంటూ కారు స్టార్టు చేశాడు సూర్యం. వెలుగుబాట వెంట కారు పోసాగింది.

